

అనంతలో అమ్మపాల డెయిరీ

- జిల్లా ఆస్పత్రిలో రూ.50 లక్షలతో ఏర్పాటు
- 8న ప్రారంభం
- హాజరుకానున్న వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్, వైద్యాధికారులు



తల్లిపాల డెయిరీ ఏర్పాటు చేస్తున్న గది

అనంతపురం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పుట్టిన పసిబిడ్డకు ఆరునెలల వరకు తల్లిపాలే అన్నం, నీళ్ల అన్నీ. తల్లిపాల ద్వారానే పసిపిల్లలకు అవసరమైన పోషకాలన్నీ అందుతాయి. అలాగని ఆరునెలలు మాత్రమే పాలివ్వాలన్న రూల్ లేదు. ఏడాది, రెండేళ్ల వరకు పసిపిల్లలకు తల్లులు పాలు ఇచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇళ్లలోనే ఉండే తల్లులకు తమ పిల్లలకు పాలివ్వడానికి ఇబ్బంది ఉండదు. వివిధ ఉద్యోగాలు చేసేవారికి కష్టంగా ఉంటుంది. గర్భందాల్చిన తర్వాత కడుపులో పిండాన్ని కాపాడుకోవడం ఎంత కష్టమో, ప్రసవం తర్వాత పసిపిల్లలను కాపాడుకోవడం కూడా అంతే కష్టంగా మారింది. పౌష్టికాహారం తీసుకోకపోవడం, ఇంటి, ఉద్యోగ బాధ్యతలతో తల్లులు మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారు. దీంతో వారికి పాలు పడడంలేదని వైద్యులు అంటున్నారు. ఆర్థికంగా బాగున్న తల్లులు, అందంపై మోజు ఉన్నవారు.. పుట్టిన బిడ్డలకు పాలు పట్టిస్తే ఎక్కడ తమ అందం తగ్గిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో పిల్లలకు పాలు పట్టించడంలేదు. ఆ పిల్లలకు మార్కెట్‌లోకి వచ్చిన వివిధ రకాల పాలడబ్బాలు, గేదె, ఆవు పాలు పట్టిస్తున్నారు. అవి పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఈ తరుణంలో తల్లిపాలను భద్రపరిచే పద్ధతి ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. పిల్లలు చనిపోయిన తల్లులు పాలను ఇస్తే డెయిరీలో భద్రపరచి, అవసరమున్న వారికి అందజేస్తారు. ఆస్పత్రిలో ప్రసవించగానే ఒక్కోసారి తల్లి చనిపోతుంది. పుట్టిన బిడ్డకు పాలు పట్టే అవకాశం లేకుండా పోతుంది. అలాంటి పిల్లలకు అమ్మపాల డెయిరీలో సేకరించిన పాలను పడతారు. ప్రసవం తర్వాత కొందరు తల్లులకు పాలు పడవు. అలాంటి వారి పిల్లలకు కూడా డెయిరీ ద్వారా సేకరించిన పాలు పట్టవచ్చు. ఆస్పత్రిలో పిల్లలు పుట్టగానే చనిపోతుంటారు. అలాంటి తల్లులు పాలను డెయిరీకి ఇవ్వొచ్చు.

మూడేళ్లుగా ప్రయత్నాలు..

అనంత ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారుల కృషితో తల్లిపాల డెయిరీ ఏర్పాటు కాబోతోంది. జిల్లా ఆస్పత్రిలో ప్రసవాలు అత్యధికంగా జరుగుతున్నాయి. రోజుకు సరాసరి 20 ప్రసవాలు జరుగుతాయి. ఈలెక్కన నెలకు 600, ఏడాదికి 8 వేలదాకా ప్రసవాలు చేస్తున్నారు. చాలామంది తల్లులు ప్రసవ సమయంలో వివిధ కారణాలతో చనిపోవడం, తక్కువ నెలల్లోనే పిల్లలు పుట్టడంతో తల్లులకు పాలుపడకపోవడం, పిల్లలు అనారోగ్యం బారిన పడడం జరుగుతోంది. దీంతో మూడేళ్లుగా జిల్లా ఆస్పత్రిలో మదర్స్ మిల్క్ డెయిరీ ఏర్పాటుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు డెయిరీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. చకచకా నిర్మాణ పనులు సాగుతున్నాయి.

రూ.50లక్షలతో...

జిల్లా ఆస్పత్రిలో మదర్స్ మిల్క్ డెయిరీ ఏర్పాటుకు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత నిధుల కోసం వివిధ సంస్థలను ఆశ్రయించారు. చివరకు తాడిపత్రికి చెందిన అర్జాస్ స్టీల్ కంపెనీ రూ.45 లక్షలు విరాళం ఇవ్వగా.. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎంపీ నిధులు రూ.10లక్షలు కేటాయించారు. దీంతో ఆస్పత్రిలోని మొదటి అంతస్థులో నవజాత పిల్లలకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎస్ఎన్‌సీయూ విభాగం, తల్లులు పాలివ్వడానికి ప్రత్యేక వార్డు ఉంది. వాటికి ఎదురుగా ఉన్న గదిలోనే మదర్స్ మిల్క్ డెయిరీని ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 8వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరుకానున్నారు.



మూడేళ్ల శ్రమకు ఫలితం

ఆనంత ఆస్పత్రిలో మూడేళ్ల క్రితమే తల్లిపాల డెయిరీ ఏర్పాటుచేస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. డెయిరీలు దాతల సహకారంతో ఏర్పాటు చేసి, నడుస్తున్నాయి. ఇక్కడ దాతల సాయం కోసం ప్రయత్నాలు సాగిస్తూనే ప్రభుత్వ ఆమోదానికి పంపాం. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏళ్ల కల నెరవేరబోతోంది. ఇది ఆస్పత్రిలో పేద పసిపిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

-డాక్టర్ హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ

ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం

ఆస్పత్రిలో మదర్స్ మిల్క్ డెయిరీని దాదాపు రూ.50 లక్షలతో ఏర్పాటు చేస్తున్నాం. ఈనెల 8వ తేదీన ప్రారంభిస్తున్నాం. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి





అర్ధాంతరంగా ఆగిపోయిన ఆయకట్టు కాలువ పనులు

చాఘొల్లు..!

- ఏళ్లు గడిచినా పూర్తికాని చాగల్లు ఆయకట్టు కాలువ
- 2018లో కాలువ పనులకు శంకుస్థాపన
- పూర్తిబడ్జెట్‌లో 70శాతం వినియోగం
- రైతులకు అందని నష్టపరిహారం



పూర్తికాని ఆయకట్టు కాలువ కల్వర్టు నిర్మాణం

పెద్దపప్పూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా చాగల్లు ఆయకట్టు కాలువ నిర్మాణం పూర్తి కావడం లేదు. ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం చాగల్లు రిజర్వాయర్ నుంచి షేక్‌పల్లి, అమ్మలదిన్నె గ్రామాల మీదుగా కొండాపురం నుంచి హెచ్చెల్సీ కాలువను నిర్మించడానికి పనులు చేపట్టింది. రూ.39 కోట్ల అంచనా వ్యయంతో 2018లో ఈ కాలువ పనులు ప్రారంభించారు. అయితే ఇప్పటిదాకా 70శాతం మేర నిధులు మాత్రమే వెచ్చించారు. కాలువ పనులు మాత్రం అలాగే ఉండిపోయాయి. ఈ కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.10 లక్షలు చెల్లిస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే ఇప్పటి వరకూ భూములు కోల్పోయిన రైతులకు నయా పైసా ఇవ్వలేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. కొన్నేళ్లుగా కాలువ పనులను అసలు పట్టించుకోకపోవడంతో అప్పటి వరకూ చేసిన పని కూడా వృథాగా మారింది. ఆ కాలువలో పిచ్చిమొక్కలు పెరిగాయి. మట్టి, రాళ్లతో కాలువ నిండిపోయింది. కాలువ అధ్వాన స్థితి గురించి అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ పూర్తయితే 11కిలోమీటర్ల మేర 3700హెక్టార్లకు సాగునీరు అందుతుందని వారు పేర్కొంటున్నారు.

పరిహారం ఇవ్వలేదు: రాగిపిండి అనసూయ, రైతు



2018లో ప్రారంభించిన కాలువ పూర్తి అయితే మా గ్రామాలకు సాగునీటి సమస్య తీరుతుందని మా భూములను ఇచ్చాం. అందుకుగాను మా భూములకు ఎకరాకు రూ.10లక్షల నష్టపరిహారం అందిస్తామని అప్పటి అధికారులు తెలిపారు. కానీ కొంతమేర పనులు పూర్తయినప్పటికి మాకు ఎటువంటి నష్టపరిహారం అందలేదు.

పై అధికారులకు చెప్పాం: హరినాథ్,చాగల్లు ప్రాజెక్టు ఏఈ

ఈ కాలువ పనులను 2018లో ప్రారంభించినమాట వాస్తవమే. ఇప్పటి వరకు పూర్తి నిధుల నుంచి 70శాతం మేర ఖర్చు చేశాం. పై అధికారులకు విషయాన్ని తెలియజేసినప్పటికి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి చెబుతామని తెలియజేస్తున్నారు.

మహిళల జీవనోపాధుల పెంపే లక్ష్యం

సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ

అనంతలో రాష్ట్రస్థాయి సదస్సు



మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పన ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ పేర్కొన్నారు. స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం విలువ ఆధారిత మార్కెటింగ్‌పై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు (వర్క్‌షాప్) నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పాల్గొన్నారు. సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ.. మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవన ప్రమాణాలు పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆ దిశగా ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. గ్రామీణ మహిళలు ఉత్పత్తి చేసే వస్తువులు, పంట దిగుబడుల మార్కెటింగ్‌కు కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రైతుల తలసరి ఆదాయం పెంచే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం వివిధ జిల్లాల రైతులు పండించిన పంట ధాన్యాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, ఫ్లిప్‌కార్ట్ కార్పొరేట్ వ్యవహారాల డైరెక్టర్ గిరీష్‌నాయర్, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, వ్యవసాయ జేడీ ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

కలిసిమెలిసి పని చేయండి..!

ఎమ్మెల్యే, నాయకులకు సీఎం చంద్రబాబు సూచన

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా పనిచేయాలని, శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులకు సీఎం చం ద్రబాబు సూచించినట్లు తెలిసింది. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి పార్టీ నియోజకవర్గ నాయకులు సీఎంతో భేటీ అయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, బండారు లీలావతి సీఎంను కలిసినవారిలో ఉన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో కలిసికట్టుగా పాల్గొనాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని వారికి సీఎం సూచించారని తెలిసింది. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కూడా సమష్టి నిర్ణయం తీసుకోవాలని, పార్టీ కోసం పని చేసిన వారి పేర్లు ప్రతిపాదించాలని సూచించారని సమాచారం. సీనియర్ నేతలు, కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని, వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలని సుతిమెత్తగా మందలించినట్లు తెలిసింది. సలకంచెరువు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ఈడిగ శ్రీనివాసులు అనారోగ్యం బారిన పడ్డారని, సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించాలని కోరినట్లు నాయకులు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే శ్రావణి, నాయకులు ఆలం, ముంటిమడుగు, రామలింగారెడ్డి తదితరులు

ఆ రేటుకా..? అమ్మలేం!

- పప్పుశనగ విక్రయించేందుకు రైతుల నిరాసక్తత
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరే కారణం
- ఇప్పటిదాకా 24 మంది రైతులే రిజిస్ట్రేషన్



గోదాములో నిల్వ చేసిన పప్పుశనగ పంట

అనంతపురం అర్బన్/విడపనకల్లు ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పప్పుశనగను విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధర ఉండటమే ఇందుకు కారణం. పప్పుశనగ క్వింటా మద్దతు ధరను ప్రభుత్వం ఈ ఏడాది రూ.5650గా నిర్ణయించింది. రిజిస్ట్రేషన్ ఆరంభానికి ముందు బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువ ఉండేది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభించిన తర్వాత ధర పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పప్పుశనగ దిగుబడిని అమ్మేందుకు రైతులు నిరాసక్తత చూపుతున్నారు. అందుకే రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు.

24 మంది మాత్రమే రిజిస్ట్రేషన్

ఈ ఏడాది మార్చి 11 నుంచి రైతు సేవాకేంద్రాల్లో పప్పుశనగ దిగుబడులు విక్రయించే రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. ఇప్పటి దాకా కేవలం 24 మంది రైతులు రైతు సేవాకేంద్రాల్లో తమపేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో పుట్లూరు మండలంలో 8 మంది, తాడిపత్రి4, బెళుగుప్ప 6, పెద్దపప్పూరులో నలుగురు రైతులున్నారు. రిజిస్ట్రేషన్ ఆరంభించాలని జిల్లాలోని పలు రైతు సేవా కేంద్రం సిబ్బందికి వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేయలేదని తెలుస్తోంది. అంతలోనే మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో అధికారులు మిన్నకుండిపోయినట్లు సమాచారం.

దిగుబడులు అంతంతే..

2024-25 రబీ సీజన్‌లో జిల్లాలో 57వేల హెక్టార్లల్లో పప్పుశనగ సాగైంది. పంట బాగా పండితే ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. జిల్లాలోని ఒక్కో మండలంలో ఒక్కో రకంగా దిగుబడులు వచ్చాయి. ఈ ఏడాది తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆ ప్రాంతంలో తెగుళ్లు ఎక్కువగా సోకపోవడంతో దిగుబడి తగ్గింది. మిగిలిన మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఎకరాకు 4 - 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

గోదాముల్లో నిల్వలు

జిల్లాలోని బెళుగుప్ప, తాడిపత్రి, పుట్లూరు, యాడికి ఇతర మండలాలకు చెందిన రైతులు పప్పుశనగ దిగుబడులను గోదాముల్లో నిల్వ చేసుకున్నట్లు సమాచారం. 2023- 24 సంవత్సరంలో పంట కోత సమయంలో క్వింటా రూ.5500 పలికింది. ఆ తర్వాత కొన్ని నెలలకు క్వింటా పప్పుశనగ రూ.6వేల నుంచి రూ.6500 పలికింది. గత కొన్నేళ్ల క్రితం క్వింటా రూ.10వేలకుపైగానే పలికింది. ఆ తర్వాత ప్రతి ఏడాది ధర తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో క్వింటా ధర రూ.5700 నుంచి రూ.5800 దాకా పలుకుతోంది. ఈ సారి దిగుబడులు తక్కువ కావడంతో ధరలు పెరగకపోతాయా అన్న ఆశతో ఎక్కువ మంది రైతులు గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నట్లు సమాచారం.

గోదాములో నిల్వ చేశా



నేను నాలుగు ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో గుంతకల్లులోని గోదాములో నిల్వ చేశా. ఈ సారి దిగుబడులు తగ్గడంతో ధరలు పెరగకపోతాయా అనే ఆలోచనతోనే నిల్వ చేశా.

- శంకరయ్య, గడేకల్లు, విడపనకల్లు మండలం

మార్కెట్‌లో అమ్మేశా



మూడు ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.5600తో బయట మార్కెట్‌లో అమ్మేశా. మద్దతు ధరతో సమానంగానే బయట మార్కెట్‌లో ధర ఉంది. ప్రస్తుతం మరో వెయ్యి రూపాయలు పెరిగింది. అందుకే రైతు సేవా కేంద్రంలో రైతు లెవరూ రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. డబ్బులు అవసరం కావడంతో నిల్వ చేసుకోకుండా పంటను అమ్మేశా.

- వినోద్, గడేకల్లు, విడపనకల్లు మండలం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఈ ఏడాది మార్చి 11 నుంచి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభమైంది. ఇప్పటి దాకా ఐదు మండలాల్లో 24 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టిన తర్వాత మద్దతు ధర కంటే బయట మార్కెట్‌లో ధర పెరిగింది. ఈ కారణంతోనే రైతు సేవా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. మరికొంత మంది రైతులు ధర పెరుగుతుందన్న ఆశతో నిల్వ చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

- పెన్నేశ్వరి, ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజర్, అనంతపురం

పంటలకు వాన దెబ్బ..!

- అరటి, వరి నేలమట్టం
- తడిసిన వేరుశనగ కట్టె
- రాలిపోయిన మామిడికాయలు
- రూ.2.15 కోట్లకుపైగా పంట నష్టం

- వివరాలు 7లో



శింగనమలలో దెబ్బతిన్న వరి పంట

చుక్కలు సరిదిద్దుతాం: కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ చూపుతామని కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో అనంతపురం డివిజన్‌కు సంబంధించి జిల్లా స్థాయి చుక్కల భూముల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతివారం షెడ్యూల్ వేసుకొని జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహిస్తూ తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో అన్ని డివిజన్‌ల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో కళ్యాణదుర్గం డివిజన్‌కు సంబంధించి ఆరు ఫిర్యాదులు రాగా విచారించి ఐదింటికి ఆమోదం తెలిపారు. ఒక ఫిర్యాదును తిరస్కరించారు. బుక్కరాయసముద్రం మండలం నుంచి రెండు ఫిర్యాదులు రాగా అందులో రెండింటిని కమిటీలో ఆమోదించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్‌సెక్షన్ ఆఫీసర్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పుణ్యవతి, మహబూబ్‌బాషా, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

కళ వరింత ఏదీ..?

మాయమవుతున్న నాటక రంగం

- అంతరించిపోతున్న బయలు నాటకాలు
- గతమెంతో ఘనం
- ప్రదర్శన అంటే ఊరంతా పండగే..!



సుందోప సుందర నాటకంలో పాత్రధారి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం అనేక గ్రామీణ కళలను మృత్యు ఒడికి చేర్చుతూ వస్తోంది. పల్లె ప్రజలకు వినోదం పంచిన రంగుల కళలు వెలిసిపోతున్నాయి. ఎందరికో ఉపాధి, గుర్తింపు తెచ్చిన గ్రామీణ కళలు అంతరించిపోతున్నాయి. అలాంటిదే బయలు నాటకం. గ్రామీణ ప్రజలకు ఒకప్పుడు ఎంతో వినోదం పంచిన ఈ కళ ఆదరణ కొరవడి కునారిల్లుతోంది. కర్ణాటక సరిహద్దులో ఉన్న బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, కణేకల్లు మండలాల్లో బయలునాటకల ప్రదర్శనలు ఎక్కువగా జరుగుతుండేవి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఏటా పండుగ వేళాల్లో నిర్వహిస్తుండేవారు. ఈ ప్రాంతాలలో నాటక ప్రదర్శనలు కన్నడ భాషలోనే సాగేవి. ఆశ్వమేధ యాగం, అభిమన్యుని పరాక్రమం, సుందోప సుందర, పాండువిజయ మొదలైన కథాంశాలను ఎక్కువగా ప్రదర్శించేవారు. నాటకాలు ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురు చూసిన వారు, నాటక ప్రదర్శన పట్ల ఆసక్తి కనబరిచేవారు రానురాను కనుమరుగయిపోయారు.

మొత్తం అద్దె సామగ్రినే

ఈ నాటక ప్రదర్శనలోని మరో ముఖ్య అంశం వేషధారణ. చెళ్లకెర, బళ్లారి ప్రాంతాలకు చెందిన డ్రస్సింగ్ కంపెనీవారు వేషధారణకు అవసరమైన సరంజామా సరఫరా చేస్తారు. వేషానికి కావాల్సిన డ్రస్సులు, ఆభరణాలు మొత్తం వీరు అద్దెకు ఇస్తారు. ఒక్కొక్క ప్రదర్శనకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు అద్దె వసూలు చేస్తుంటారు. గురువు వద్ద 3, 4 నెలలు శిక్షణ పొందిన తర్వాత నాటక ప్రదర్శన చేస్తారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన ప్రదర్శన తెల్లవారేంత వరకు ఉంటుంది.

గ్రామంలోని వారే జట్టుగా...

ఏదైనా గ్రామంలోని పెద్దలు, యువకులు ఓ బృందంగా ఏర్పడి ఈ బయలనాటక ప్రదర్శనకు శ్రీకారం చుడతారు. నాటకం నేర్చుకోవడానికి ఓ గురువును నియమించుకుంటారు. ప్రతి రోజూ రాత్రివేళలలో 3, 4 గంటలు పాటు శిక్షణ పొందుతారు. పగటి సమయంలో తమ పనులలో నిమగ్నమైనవారు రాత్రి నేర్చుకున్న డైలాగులు, పద్యాలు చెప్పుకుంటూ తమ పనులను ఉత్సాహంగా చేస్తుంటారు. ఒక నాటకంలో 10 నుంచి 12 మంది వరకు పాత్రధారులుంటారు. అన్ని పురుషపాత్రలే ఉంటాయి. రెండు, మూడు స్త్రీ పాత్రధారులను ఇతర ప్రాంతాల నుంచి పిలిపించుకుంటారు. వారిని రాణులు అని పిలుస్తుంటారు. వీరు నాటక ప్రదర్శనలే వృత్తిగా చేసుకొని బయలునాటకాల ప్రదర్శనలు చేస్తుంటా రు. వీరు ఒక నాటకానికి రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు తీసుకుంటారు. ప్రతి నాటక ఘట్టాన్ని పూర్తిగా నేర్చుకుని ఉంటారు.

ఊరంతా పండగే

ప్రదర్శన రోజు ఊరంతా పండగ వాతావరణం నెలకొంటుంది. ప్రతి పాత్రధారుడు తన బంధువర్గానంతటిని ఇంటికి పిలిపించుకుంటాడు. విందు భోజనాలు ఏర్పాటు చేస్తాడు. ఉదయం నుంచే రంగస్థల అలంకరణ ప్రారంభమవుతుంది. చీకటి పడేవేళకు గ్రామమంతా రంగస్థలం ముందు చేరుకుంటుంది. కరెంటు దీపాల వెలుగులో రంగు రంగుల దుస్తులతో ప్రేక్షకుల మధ్య నుంచి తప్పెట్లమోతకు అను గుణంగా చిందులు వేస్తూ పాత్రధారులు రంగస్థలంపైకి వస్తుంటారు. ప్రతి డైలాగును గట్టిగా ఉచ్ఛరిస్తూ చేతిలోని ఆయుధాన్ని తిప్పుతూ డైలాగులు చెబుతూ ప్రేక్షకులకు వినోదాన్ని కలిగిస్తుంటారు. పాత్రధారులతో కలిసి ఫొటోలు దిగడం, బహుమతులు ఇవ్వడం ఓ సరదా. ఇలాంటి అపూరూపమైన నాటక ప్రదర్శనలు ఈ మధ్య పూర్తిగా కనుమరుగవుతున్నాయి. వీటికి కారణం ఆర్థికంగా గ్రామీణ ప్రాంత ప్రజలు భరించలేకపోవడం. ఇప్పటి యువత వీటిపై పెద్దగా ఆసక్తి చూపకపోవడం ఓ కారణం. అప్పట్లో నాటక ప్రదర్శన మొత్తం ఖర్చు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు వచ్చేది. ప్రస్తుతం అదే నాటక ఖర్చు రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు అవుతుందని అంటున్నారు.

వర్షాల కోసం..

వర్షాలు కురవని సమయంలో బయలు నాటకాలు ఆడితే మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండేవని ప్రజల నమ్మకం. నేడు వ ర్షాలు రాకపోయినా ఆర్థికంగా స్థి మితంగా లేకపోవడంతో బయ ల నాటకాల జోలికి వెళ్లడం లే దు. కనుమరుగవుతున్న నాటక ప్రదర్శనలు పదికాలాల పాటు నిలిపేందుకు ప్రభుత్వాలు, ఔత్సాహికులు చొరవ చూపాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

టైరు బండే వేదిక

బయలు నాటక ప్రదర్శనకు టైరు బండినే వేదికగా ఉపయోగించేవారు. రెండు చక్రాలను తీసివేసి ఆ టైర్ల బండను ఒకదాని పక్కన ఒకటి పెట్టి దానిపై నుండి పౌరాణిక కథలను ప్రదర్శించేవారు. చాలా చక్కటి సంభాషణలతో, వేషాలతో చూపరులను ఆకట్టుకునేవారు. ఇప్పుడు ఎప్పుడైన నాటక ప్రదర్శన చేసేవారు చెక్క పలకలను అద్దెకు తెచ్చి రంగస్థలం వేదికను ఏర్పాటు చేస్తారు. ఆ వేదికపై మైకులు ఏర్పాటు చేసి డైలాగులను చెబుతారు. నాడు మైకులు కూడా ఉండేవి కావు. వారి కంఠ స్వరంతోనే డైలాగులు చెప్పేవారు.



వినోదంలా ఉండేది

అప్పుడు బయలాటలంటే గ్రామాల్లో ఒక వినోదం. బయలాట ఆడేందుకు పాత్రధారులు ఎంతో ఉత్సాహం చూపేవారు. కాలక్రమేనా ఖర్చులు పెరగడం, వాటిపై ఆసక్తి లేకుండా డ్రామాలు వైపు మళ్లడం బైలాటాలు కనుమరుగయ్యాయి. నేను గతంలో శ్రీకృష్ణ, దుర్యోదన, కర్ణ పాత్రలతో పాటు బయలాటలు ఆడా. మేనేజర్‌గా ఉండి బయలాటలు ఆడించా. ఇప్పుడు పెద్దగా ఆసక్తి కనబరిచేవారు లేరు.

- లోక్‌నాథ్‌రెడ్డి, శ్రీధరఘట్ట

దేవాలయం తరపున ఆడిస్తున్నాం

మా గ్రామంలో శ్రీనరసింహస్వామి జలధి జాతర మహోత్సవం రోజున ప్రతి ఏటా బయలాటలు ఆడేవారు. మాస్టారు కథ, రామాయణం నాటకాలు ఎక్కువగా ఆడేవారు. ఖర్చులు పెరగడం వల్ల ఆడకుండా స్వామి వారి జలధి మహోత్సవం రోజున ప్రతి ఏటా వేరే గ్రామాలకు చెందిన వారితో బయలాటలు దేవాలయం తరపున ఆడిస్తున్నాం. ఇక్కడ వారు ఎక్కువగా ఆసక్తి చూపకపోవడంతో రాత్రంతా ప్రజలకు వినోదం కోసం ఇతర గ్రామాలకు చెందిన వారిని పిలిపించి కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

- ఓబుళస్వామి, ఉప్పరహాళ్



కొత్త సేద్యగాళ్లు అద్వితీయం

రాయలసీమ నాటక రచనా పోటీల ఫలితాలు విడుదల



దామోదర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్/ సెంట్రల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాయలసీమ నాటక రచనా పోటీల ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. సీనియర్ రచయిత, రాయలసీమ ఉద్యమనేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి స్మారకార్థం రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఇటీవల రాయలసీమ నాటక రచనా పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను ఆ వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రచయితలు నాటక రచనలను పంపారు. తిరుపతికి చెందిన వీఆర్ రాసాని రచించిన 'దేవర మాన్యం' రచనకు ప్రథమ బహుమతి దక్కింది. అనంతపురానికి చెందిన డాక్టర్ పామిరెడ్డి దామోదర్‌రెడ్డి రచించిన 'కొత్త సేద్యగాళ్లు' రచనకు ద్వితీయ బహుమతి వచ్చింది. తృతీయ బహుమతికి హైదరాబాద్‌కు చెందిన పాణ్యం దత్తశర్మ రచించిన 'నల్లకాలర్' హిందూపురానికి చెందిన శాంతి జయప్రకాష్ రచించిన 'సమిధలు', కళ్యాణదుర్గానికి చెందిన 'పరివర్తన' నాటకాలు ఎంపికయ్యాయన్నారు. అలాగే ప్రత్యేక బహుమతుల కింద ఏలూరు జిల్లా వెంకట నాగేంద్ర మాగంటి రచించిన 'వేట కొడవలి', కర్నూలుకు చెందిన పర్వతయ్య రచించిన 'చిన్నారి రేఖ', విశాఖపట్నానికి చెందిన పీవీ శేషారత్నం రచించిన 'విజేత', చెన్నైకు చెందిన చతుర్వేదుల చెంచు సుబ్బయ్యశర్మ రచించిన 'సఖ్యత' నాటకాలు ఎంపికయ్యాయన్నారు. వీరందరికీ రూ.20 వేలు నగదు బహుమతిని ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు తెలిపారు. కాగా పోటీల్లో తన 'కొత్త సేద్యగాళ్ళు' నాటక రచనకు ద్వితీయ బహుమతి లభించడం ఆనందంగా ఉందని ప్రముఖ కవి, రచయిత డాక్టర్ దామోదర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏడు నుంచి అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని టీచర్ల సీనియారిటీ జాబితాపై ఈ నెల ఏడో తేదీ నుంచి 12వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు డీఈఓ ప్రసాద్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నమెంట్, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యల కింద పనిచేసే టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితాను ఇప్పటికే తయారు చేశామన్నారు. మార్చి 10వ తేదీ మొదటి విడత, 22న రెండో విడత అభ్యంతరాలు స్వీకరించి సరి చేశామన్నారు. ఎస్‌జీటీ, తత్సమాన కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం సబ్జెక్టుల వారీగా టీచర్ల తాత్కాలిక సీనియారిటీ జాబితాను రూపొందించామని తెలిపారు. ఈ జాబితాను 4వతేదీ డీఈఓ బ్లాగ్‌లో, నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలుంటే... ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీలోగా డీఈఓ ఆఫీస్‌లో ఆధారాలతో తెలియజేయాలన్నారు.

పాలకవర్గం ప్రపోజల్స్ పంపండి

మార్కెట్ కమిటీలపై ప్రభుత్వ ఆదేశం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఇటీ వల పలు మార్కెట్ కమిటీలకు సంబంధించిన చైర్మన్లను ఎంపిక చేస్తూ ప్రభుత్వం జాబితా విడుదల చేసిన విషయం విదితమే. ఆమేరకు ఆయా కమిటీల పాలకవర్గ సభ్యుల ప్రపోజల్స్ పంపించాలని సంబంధిత ఉన్నతాధికారుల నుంచి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఈక్రమంలో ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, గుత్తి, మడకశిర, హిందుపురం, ధర్మవరం కమిటీలకు సంబంధించి చైర్మన్, వైస్‌చైర్మన్, ఇతర సభ్యులకు సంబంధించిన ప్రపోజల్స్ పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొనట్లు ఉమ్మడి జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఆమేరకు ఆయా కమిటీలకు సంబంధించిన పాలక వర్గ సభ్యుల ప్రపోజల్స్ సిద్ధం చేసి రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వానికి పంపనున్నారు. ఆ తరువాత పాలక వర్గ సభ్యుల వివరాలు సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటించనున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది.

యూనిట్లను గ్రౌండింగ్ చేయించాలి: కలెక్టరు

అనంతపురం టౌన్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయించాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు 1728యూనిట్లు మంజూరు కాగా ఇప్పటివరకు మున్సిపాల్టీలు, ఎంపీడీఓలుకలిసి 1571యూనిట్లను బ్యాంకులకు పంపినట్లు తెలిపారు. మిగిలిన యూనిట్లకు వెంటనే లబ్ధిదారులను ఎంపిక చేసి బ్యాంకులకు పంపాలని సూచించారు. ఈనెల 11కి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ, సుబ్రహ్మణ్యం, ఎల్డీఎం మానస, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ఈ దాహం తీరనిది !

గుత్తిలో తాగునీటి కష్టాలు

గతం కంటే మెరుగైనా.. ఇంకా ఇబ్బందులే

కేటాయింపు మేరకు సరఫరా కాని నీరు

ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు

గుత్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా గుత్తి మున్సిపాలిటీలో ప్రజల తాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. వైసీపీ పాలనలో కంటే ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడినప్పటికీ పలు వార్డుల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతూనే ఉన్నారు. సత్యసాయి, వైటీ చెరువు (వైటీసీ) ప్రాజెక్టుల నుంచి కేటాయించిన మేరకు నీరు సరఫరా కాకపోవడం, స్థానికంగా ఉన్న జలవనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. మున్సిపల్ పరిధిలో 25వార్డులు ఉండగా 50వేల జనాభా ఉంది. 6532 కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఒక్కరికి నిర్దేశించిన ప్రమాణాల మేరకు రోజుకు 130లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 40లీటర్లు మాత్రమే అందిస్తున్నా రు. 163స్పాట్ డెలివరీ ట్యాంకులు ఉన్నాయి. పట్టణ జనాభాకు రోజుకు 40లక్షల లీటర్లు అవసరమైతే 23లక్షలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. వైటీసీ ప్రాజెక్టు ద్వారా రోజుకు 15లక్షల లీటర్ల నీరు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 5లక్షలు మాత్రమే సరఫరా అవుతున్నాయి. సత్యసాయి ప్రాజెక్టు ద్వారా 25లక్షల లీటర్లు రావాల్సి ఉండగా 15లక్షలు మాత్రమే సరఫరా అవుతున్నాయి. ఈ ప్రాజెక్టులకు రూ.22కోట్ల మేర మున్సిపాలిటీ బకాయిపడింది.



నిలిచిపోయిన ట్యాంక్ పనులు

గతంలో నెలకోసారి సరఫరా

మున్సిపల్ పరిధిలో గుత్తి, గుత్తి ఆర్ఎస్, నూరసింగపల్లి, చెట్నేపల్లి ఉన్నాయి. గత వైసీపీ పాలనలో నెలకొకసారి నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం గుత్తి చెరువుకు హంద్రీనీవా జలాలు తెప్పించి 15రోజులకొకసారి సరఫరా చేస్తోంది. మరి కొన్ని వార్డులలో మూడు రోజులకొకసారి నీరు సరఫరా అవుతోంది. మూలనపడ్డ నీటి పథకాలను పునరుద్ధరించారు. వేసవిలో భూగర్భజలాలు తగ్గిపోయేప్రమాదం ఉండటంతో నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. గత ప్రభుత్వంలో ట్యాంకర్ల యజమానులకు దాదాపు రూ.1కోటి మేర బకాయి పడ్డారు. ప్రస్తుతం నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, ట్యాంకర్లకు టెండర్లను పిలచి నీటి సరఫ రా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. 35ఏళ్ల క్రితం వేసిన పైపులైను కావడంతో తరచూ తాగునీటి పథకాల పైపులైన్లు పగలిపోయి, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.

15 కాలనీలలో నీటి కష్టాలు

పట్టణంలోని దాదాపు 15 కాలనీల్లో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. కొళాయిల ద్వారా నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. బీసీ కాలనీ, జడ్‌వీరారెడ్డి, దాసరి కాలనీ, పైమాల వీధి, కోటవీధి, బండలపాలిష్ ఏరియా, చెట్నేపల్లి, గుత్తిఆర్ఎస్ ఎస్సీ కాలనీ తదితర కాలనీలో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ పరిధిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా సత్వరమే చర్యలు చేపట్టాం. రూ.90లక్షలు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తిఅయ్యాయి. ఈ నిధులతో నూతన బోర్లు, పంపు మోటర్లు, పైపులైన్ల మరమ్మతులు చేయిస్తాం. ఎక్కడ నీటి సమస్య ఉంటే అక్కడ బోరు ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందిస్తాం. సమ్మర్ యాక్షన్‌ప్లాన్ కింద రూ.1.96కోట్లతో నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. పామిడి పెన్నానదిలోని ఏడుబోర్లకు సంబంధించి గత వర్షాలకు పైపులైన్ దెబ్బతినడంతో వాటి మరమ్మతుల కోసం ఎంపీ నిధులు రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో పైప్‌లైన్ పునరుద్ధరించి తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతాం. రూ.173కోట్ల మిడ్‌పెన్నార్ ప్రాజెక్ట్ పూర్తయితే గుత్తికి తాగునీటి సమస్య తీరుతుంది.

- జబ్బర్‌మీయా, మున్సిపల్ కమిషనర్

ఎస్‌ఐ ప్రకృతి సేద్యం..!

రకరకాల పండ్లమొక్కల సాగు... విరగ్గాసిన చెట్లు



మామిడి పంటను చూపుతున్న ఎస్‌ఐ

బెళుగుప్ప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రసాయన మందులు, ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి హానికరమనీ, భూమిని నిస్సారం చేస్తాయని తెలిసినా చాలా మంది రైతులు వాటినే వాడుతున్నారు. ఓ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) మాత్రం ప్రకృతి వ్యవసాయ విధానంపై ఆసక్తి పెంచుకున్నారు. ఇది లాభదాయకమని చాటి చెప్పాలనుకున్నారు. అదే పట్టుదలతో పంటలు పెట్టారు. 1.20 ఎకరాలో రకరకాల పండ్లమొక్కలు నాటారు. దేశవిదేశాల నుంచి సైతం మొక్కలు తెప్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేశారు. చెట్లు కాపునకు వస్తున్నాయి. కొన్ని విరగ్గాశాయి కూడా.

రకరకాల మొక్కలు..

నంద్యాల జిల్లా ఆవుకు మం డలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఈయన తెలంగాణలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. బెళుగుప్ప మండలం గుండ్లపల్లిలో వి వాహం చేసుకుని, ఇక్కడే నాలుగేళ్ల క్రితం 1.20 ఎకరా భూమి కొనుగోలు చేశారు. అందులో పండ్లతోట సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలోనే 250 మామిడి మొక్కలు, పనస పది, సీతాఫలం 20, అంజీర పది, జామ 30, నేరేడు ఐదు, సపోట, దాల్చిన చెక్క, ఎల్లో డ్రాగన్ ఫ్రూట్, ఆయుర్వేద మొక్కలు, క్యాన్సర్ నివారణకు వినియోగించేవి, బనానా మ్యాంగో కూడా సాగుచేస్తున్నారు. కిలో వెయ్యి రూపాయలు ధర పలికే టాం అట్కిన్ రకం మామిడి మొక్కలు సైతం నాటారు. భారతదేశంలోనే లేని మియాజకి, థాయిల్యాండ్ రకాల మొక్కలు సైతం సాగు చేస్తున్నారు. పలు మొక్కలను కేరళ, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా తెప్పించి, నాటారు. వాటిని పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలోనే సాగు చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్నపుడు కూలీలకు ఫోన్‌లో దిశానిర్దేశం చేస్తుంటారట. సెలవు రోజుల్లో ఇక్కడకు వచ్చి తోటలో పనులు చేస్తుంటానని ఆయన చెబుతున్నారు. పంటలు కోసి, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



ఎల్లో డ్రాగన్ ఫ్రూట్ మొక్క

ప్రకృతి వ్యవసాయం లాభసాటి అని నిరూపిస్తా

ఈ ప్రాంత నేలలు ప్రకృతి వ్యవసాయానికి అనుకూలమని గత నాలుగేళ్లలో గమనించా. ప్రకృతి వ్యవసాయ విధానంలో దిగుబడులు ఎలా ఉంటాయోనని తెలుసుకోవడానికే సాగుచేస్తున్నా. పంటకు తెగుళ్లు సోకితే వేపనూనె పిచికారీతోనే నివారించవచ్చు. ప్రకృతి సాగులో తెగుళ్ల బెడద ఉండదు. మరిన్ని పండ్లమొక్కలు సాగుచేసి, ప్రకృతి వ్యవసాయం లాభసాటి అని నిరూపిస్తా.

- రామాంజనేయులు, ఎస్‌ఐ



ఎట్టకేలకు ఎన్నికల ప్రక్రియ

అనంతపూర్ క్లబ్ ఎలెక్షన్స్‌కు గ్రీన్ సిగ్నల్

ఎన్నికల అధికారిగా జిల్లా రిజిస్ట్రార్



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మద్యం దుకాణం గది

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వివాదాలకు కేరాఫ్‌గా మారిన అనంతపూర్ క్లబ్ ఎన్నికలకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ పడింది. రెండేళ్లుగా వాయిదా పడుతూ వచ్చిన ఎన్నికలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. క్లబ్‌లో పరిణామాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలంటే కచ్చితంగా ఎన్నికలు నిర్వహించాలన్న మెజార్టీ సభ్యుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు. పైగా క్లబ్ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణానికి అద్దెకు ఇచ్చి, లోపల ఉండే ఓ గదిని వైన్‌షాప్‌కు అటాచ్డ్ రూంగా కేటాయించడం పట్ల క్లబ్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటాచ్డ్ రూంగా కేటాయించిన గదిలో ఉన్న వ్యక్తికి మరో గదిని కేటాయించడానికి ముడుపులు తీసుకున్నట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. క్లబ్‌లో బార్ అండ్ రెస్టారెంట్ బోర్డు ఉంచడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణతోనే క్లబ్‌లో వివాదాలకు ముగింపు పలకవచ్చని సభ్యులు అభిప్రాయ పడుతున్నారు. తాజాగా క్లబ్ ఆవరణలో ఉన్న అరబిక్ మెఫిల్ రెస్టారెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదం పట్ల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలు క్లబ్ లోపలివైపు ఉన్న ఇండోర్ స్టేడియంలో చెక్కకు వ్యాపించి ఉండుంటే నష్టం ఊహించని స్థాయిలో ఉండేదని భయభ్రాంతులకు లోనవుతున్నారు. క్లబ్ ఎన్నికల అధికారిగా జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ భరత్‌ను కలెక్టర్ నియమించారు.

క్లబ్‌లో మద్యం దుకాణం నిర్వహణ

అనంతపూర్ క్లబ్‌లో నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ ఆవరణలో మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. పైగా క్లబ్ లోపల ఉండే ఓ గదిని అక్కడ అద్దెకున్న వ్యక్తికి గుడ్‌విల్ ఇచ్చి ఖాళీ చేయించి, అతడికి మరో గదిని కేటాయించారు. వీధి వ్యాపారులు అద్దె చెల్లించి తమ సామగ్రి ఉంచుకున్న గదిని ఖాళీ చేయించి, అక్కడ ఆ వ్యక్తికి కేటాయించడం గమనార్హం. మద్యం దుకాణానికి అటాచ్డ్ రూంను క్లబ్ ఆవరణలో కేటాయించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ఆగస్టులోనే ముగిసింది. ఇప్పటి వరకు అదే పాలకవర్గం కొనసాగుతోంది. గతంలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా తయారీతోపాటు క్లబ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఓ వైపు ఆర్డీఓ, మరోవైపు డీసీఓలను విచారణాధికారులుగా కలెక్టర్ నియమించారు. విచారణ చేసినప్పటికీ ఆ వివరాలు బహిర్గతం చేయకపోవడం గమనార్హం.

పారదర్శకంగా ఎన్నికలు..

అనంతపూర్ క్లబ్ ఎన్నికలకు చర్యలు చేపడుతున్నాం. క్లబ్‌లో పరిణామాలతో పాటు ఓటర్ల వివరాలు ఇవ్వాలని సెక్రటరీకి సూచించాం. గతంలో ఓటర్ల వివరాల్లో జరిగిన గందరగోళంతోనే ఎన్నికలు వాయిదా వేసినట్లు చెబుతున్నారు. ఈ దఫా కచ్చితంగా ఓటర్ల వివరాలను సేకరించడంతో పాటు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ఇందులో ఎవరి జోక్యం ఉండరాదని ఇప్పటికే సభ్యులకు సమాచారం ఇచ్చాం. నిబంధనల ప్రకారమే క్లబ్ పాలకవర్గానికి ఎన్నికలు జరుగుతాయి.

- భార్గవ్ భరత్, అనంతపూర్ క్లబ్ ఎన్నికల అధికారి, జిల్లా రిజిస్ట్రార్



క్లబ్ లోపల ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ బోర్డు

రాలిన మామిడి కాయలు

శింగనమల: చిన్నజలాలపురం రైతు ఎన్వి నారాయణ తోటలో గాలివానకు మామిడి కాయలు రాలిపోయాయి. మండల వ్యాప్తంగా పది ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిందని అధికారులు తెలిపారు. శింగనమల చెరువు ఆయకట్టు కింద 50 ఎకరాల్లో వరి పంట



దెబ్బతిన్న వరి మడిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ



చిన్నజలాలపురంలో వర్షానికి రాలిన మామిడి కాయలు

నేలకొరిగింది. సోదనపల్లి-పోతురాజుకాల్వ మధ్య వంకకు భారీగా నీరు చేరడంతో నిర్మాణంలో బ్రిడ్జి దెబ్బతింది. రూ.4 లక్షల విలువ గల సెంట్రింగ్ సామగ్రి కొట్టుకుపోయిందని కాంట్రాక్టరు తెలిపారు. ఆ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొరివిపల్లి, జాల్వా కాలువ, కల్లుమడి గ్రామాల్లో 120 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. తహసీల్దారు సాకే బ్రహ్మయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పునీత్ కూమార్, మండల వ్యవసాయధికారి అన్వేష్ కూమార్ పంట నష్టాన్ని పరిశీలించారు.



నల్లమాడ మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న

పంటలకు వాన దెబ్బ..!

● అరటి, వరి నేలమట్టం ● తడిసిన వేరుశగన కట్టె ● రాలిపోయిన మామిడి కాయలు ● రూ.2.15 కోట్లకుపైగా పంటనష్టం

అనంతపురం జిల్లాలో గురువారం కురిసిన గాలివానకు రూ.2.15 కోట్లకుపైగా విలువైన పంటలు దెబ్బతిన్నాయి. తాడిపత్రి, యల్లనూరు, గార్లదిన్నె, కంబదూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, అనంతపురం రూరల్, పెద్దవడుగూరు, కూడేరు, పెద్దపప్పూరు మండలాల్లో 55 మంది రైతులకు చెందిన 60.77 హెక్టార్లల్లో రూ.1.24 కోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి, కాకర, కర్బూజ, దోస, చీనీ, కళింగర పంటలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ పరిధిలో శెట్టూరు, నార్పల, గార్లదిన్నె, అనంతపురం రూరల్ మండలాల్లో 71 మంది రైతులకు సంబంధించి 114 హెక్టార్లల్లో రూ.91.84 లక్షల విలువైన మొక్కజొన్న, వరి పంట నష్టం జరిగింది. శ్రీసత్యసాయి జిల్లాలో గురువారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. నల్లమాడ మండలంలో అత్యధికంగా 59.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇదే మండలంలోని తిప్పయ్యగారిపల్లిలో రైతు వెంకటరెడ్డి మొక్కజొన్న పంట దెబ్బతింది. దీంతో రూ.4 లక్షలు నష్టం సంభవించింది.

- అనంతపురం అర్బన్/నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)

వరి, అరటి పంట ధ్వంసం

గార్లదిన్నె: ఇల్లూరు, మర్తాడు, బూదేడు, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల్లో వరి, అరటి పంటలు నేటమట్టమయ్యాయి. మొత్తం 14 మంది రైతులకు చెందిన వరి పంట 12 హెక్టార్లలో దెబ్బతింది. బూదే



ఇల్లూరులో దెబ్బతిన్న వరి పంట



బూదేడులో వర్షానికి దెబ్బతిన్న అరటి పంట

డులో 8 మంది రైతులు 6 హెక్టార్లలో సాగు చేసిన అరటి పంట దెబ్బతింది. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్‌తో కలసి తహసీల్దార్ బండారు ఈరమ్మ శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందజేస్తుందని భరోసా ఇచ్చారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

అనంతపురం రూరల్: గాలివానకు అనంతపురం నగరంలోని డి-5 సెక్షన్ పరిధిలో ఏడు విద్యుత్తు స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. యల్లనూరు మండలంలో 13 విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ శాఖకు రూ.2.50 లక్షల వరకు నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. లైన్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేశామని ఎస్ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు.

చేతికొచ్చిన పంట..

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామ రైతులు నీలావతి, హరి (తల్లీకొడుకులు) సాగు చేసిన బీరకాయ, కాకరకాయ పంటలు నేలమట్టమయ్యాయి. వారికి రూ.10 లక్షల దాకా నష్టం జరిగింది. మరో రెండు రోజుల్లో పంట కోయాల్సి ఉండగా గాలివాన దెబ్బతీసింది. హార్టికల్చర్ అధికారి గౌసియాబీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ సునీల్, వీఆర్వో ఫక్కీరప్ప పంట నష్టాన్ని శుక్రవారం పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.



వర్షానికి నేలమట్టమైన కాకర పంట



ముక్తాపురంలో దెబ్బతిన్న దోస పంట

దెబ్బతిన్న దోస

కనగానపల్లి: ముక్తాపురంలో రైతులు రామక్రిష్ణ, లక్ష్మీనారాయణరెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో దోస పంట దెబ్బతింది. మామిళ్ళపల్లి, కుర్లపల్లిలో వెంకటరాముడు, అంకే నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డికి చెందిన 15 ఎకరాల్లో తొలగించిన వేరుశనగ పంట తడిచిపోయింది. కనగానపల్లి, బద్దలాపురం, యలక్కుంట్ల గ్రామాల్లో ఈదురు గాలులకు అరటి నేలకొరిగి భారీగా నష్టం జరిగింది.

క్రైం కార్నర్

విద్యార్థిపై అడవిపంది దాడి



చికిత్స పొందుతున్న విద్యార్థి చరణ్

కంబదూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మారెమ్మగుడి కాలనీకి చెందిన విద్యార్థి బొమ్మలాట చరణ్ శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్తుండగా అడవిపంది దాడి చేసింది. విద్యార్థి తల్లిదండ్రులు బొమ్మలాట అంజి, పుష్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చరణ్ స్థానిక ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడి కావడంతో శుక్రవారం ఉదయమే పాఠశాలకు బయల్దేరాడు. పాఠశాలకు వెళ్తుండగా దారి మధ్యలోని అరటి తోట నుంచి అడవిపంది పరుగున వచ్చి, విద్యార్థిపై దాడి చేసింది. చరణ్ అక్కడే పడిపోయాడు. అదే దారిలో వెళ్తున్న పాదచారులు గమనించి, గట్టిగా కేకలు వేసేసరికి అడవిపంది మళ్లీ అరటితోటలోకి వెళ్లిపోయింది. పాదచారులు.. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చరణ్‌కు వీపు భాగం, నడుము కిందిభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పైకి లేవలేని స్థితిలో ఉన్నాడు. వెంటనే కంబదూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం, అటు నుంచి అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అటవీశాఖాధికారులు.. విద్యార్థిని పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



హనుమంతరెడ్డి(ఫైల్)

బెళుగుప్ప, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన బెళుగుప్ప రైతు హనుమంతరెడ్డి కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శివ తెలిపారు. హనుమంతరెడ్డికి ఆరు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పప్పు శనగ సాగు చేసి అప్పులపాలయ్యాడు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు వడ్డీతో రూ.10 లక్షలు దాటాయి. ఈ క్రమంలో మనోవేదనతో మద్యానికి బానిసయ్యాడు. దిక్కుతోచని స్థితిలో గత నెల 30న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆయనకు ఇద్దరు కూతుళ్లు అనూష, పూజిత, కుమారుడు రాకేష్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండల పరిధిలో నివాసముంటున్న ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన లింగమయ్య(28) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను అవివాహితుడు. శుక్రవారం సాయంత్రం ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో విద్యుత్‌పోల్ పైకెక్కి కరెంట్ కనెక్షన్ ఇస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై కిందకు పడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్ఎస్ఎన్ఐఎస్‌లో ఆరువారాల స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హ్యాండ్ బాల్, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్‌టెన్నిస్, లాన్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, రీజనింగ్, ఉషు, యోగా క్రీడాంశాలలో ఆరు వారాల కోర్సులు ఉంటాయన్నారు. ఆయా కోర్సులలో అడ్మిషన్‌లకు ఈనెల 14 లోపు ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు అశోక్‌నగర్‌లోని ఇండోర్‌స్టేడియంలో నేరుగా లేదా ఫోన్ నంబరు 08554-315632ను సంప్రదించాలని కోరారు.

వైద్య శాఖలో ఉద్యోగాలకు..

అనంతపురం టౌన్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను ఎన్‌హెచ్ఎం(నేషనల్ హెల్త్ మిషన్) కింద కాంట్రాక్ట్ పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి తెలిపారు. ఇందులో క్లినికల్ ఫిజియోథెరపిస్టు01, ఆడియాలజిస్టు, స్పీచ్‌థెరపిస్ట్01, ఆప్తమాట్రిస్టు01, ఫార్మాసిస్టు01, డేటా ఎంట్రీ ఆపరేటర్ 04, క్లాస్ ఫోర్ సర్వీసెస్ పోస్టులు 08 ఉన్నాయన్నారు. ఈపోస్టులకు ఈనెల 10వ తేదీలోగా దరకాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని పూరించి జిల్లా కార్యాలయంలో అందజేయాలని ఓ ప్రకటనలో సూచించారు.

కట్నం కేసులో ముద్దాయికి ఏడాది జైలు

గార్లదిన్నె, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించిన కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ. 10వేలు జరిమాన విధించారు. ఈ మేరకు శుక్రవారం మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజన్ తీర్పు వెలువరించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన ప్రసాద్‌కు ఆదే గ్రామానికి చెందిన సుహాసినితో 2017లో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు సంతానం. 2019లో భర్త ప్రసాద్‌తో పా టు అత్త, మరిది కలసి ఆదనపు కట్నం తీసుకురాలేదన తనను మానసికంగా హింసించారని బాధితురాలు సుహాసిని ఫిర్యాదు చేసింది. దీనిపై గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమో దయింది. శుక్రవారం మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజన్ ముద్దాయి ప్రసాద్‌కు ఏడాది జైలు శిక్ష, రూ. 10వేలు విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.26 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.15,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1406 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

జారి పడి వైద్యుడి మృతి



మధు(ఫైల్)

అనంతపురం క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో నివాసముంటున్న డెంటల్ డాక్టర్ అమిలినేని మధు(49) ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి జారి పడి మృతి చెందారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... డాక్టర్ అమిలినేని మధు, డాక్టర్ సుష్మ భార్యాభార్తలు. వీరు నగరంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. భార్యాభర్తలు క్లాక్‌టవర్ సమీపంలో రూప డెంటల్ ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం మధు ఇంటికెళ్లి భోజనం చేసి వస్తుంటారు. అదే క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో ఇంటికెళ్లారు. కొంతసేపటికి నాలుగో అంతస్తు నుంచి జారి ఆ ఇంటి ఆవరణలో కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెం దారు. ఆ ఘటన చూసిన ఓ వ్యక్తి మధు బాబాయికి సమాచారం అం దించాడు. త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శాంతిలాల్ తెలిపారు.

పారా పోటీల్లో జిల్లాకు రజతం



రోషిరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా పోటీల్లో జిల్లాకు రజత పతకం దక్కింది. కంబోడియా దేశంలో ఇటీవల నిర్వహించిన ఒకటో ఆసియా పారా త్రోబాల్ పోటీలకు భారతజట్టు తరఫున పాల్గొన్న జిల్లా వాసి రోషిరెడ్డి అత్యద్భుత ప్రతిభ ప్రదర్శనతో రజత పతకం సాధించాడు. మలేషియాతో తలపడిన రోషిరెడ్డి మొదటి మూడు రౌండ్లలో మెరుగైన ప్రతిభతో పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు రజతపతకం సాధించిన రోషిరెడ్డికి జిల్లా పారా త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి అల్బర్ట్ ప్రేమ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

నేటి నుంచి శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు, అధ్యక్షుడు ఎర్రిస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్కీమ్ వర్కర్లకు బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లిస్తామని గతంలోనే హామీ ఇచ్చిందన్నారు. 2025 ఫిబ్రవరి 20న కళ్యాణదుర్గంలో జరిగిన ఒప్పందాలు అమలు చేయకపోవడం వల్లే సమ్మె చేసే పరిస్థితి వచ్చిందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదన్నారు. బకాయిలన్నీ కార్మికులు ఖాతాల్లో జమ చేసినపుడే సమ్మె విరమిస్తామని పేర్కొన్నారు.

ఐదుగురికి జైలు శిక్ష

కొత్తచెరువు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారేపల్లిలో పీర్ల పండుగ సందర్భంగా రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి పెనుకొండ కోర్టు ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు అప్‌గ్రేడ్ ఇన్‌చార్జ్ సీఐ సురేశ్ తెలిపారు. 2015 అక్టోబరు 15న పీర్ల పండుగ రోజు గుండం వద్ద రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అప్పట్లో కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం వాదోపవాదాలు విన్న న్యాయాధికారి మొదటి కేసులోని ముద్దాయిలు చిన్నక్కగారి నరసింహులు, చిక్కన్నగారిరవి, చిక్కన్నగారి నారాయణప్ప, చిక్కన్నగారి నాగభూషణలకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు రెండో కేసులోని ముద్దాయి ఆదిఆంధ్ర నాగేంద్రకు రెండేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. ఇందులో ఏ1, ఏ3 కేసులకు సంబంధించిన వారి కేసులు కొట్టివేశారని బాధితులకు రూ.8వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయాధికారి ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

తాడిపత్రి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబాభవానీ వీధికి చెందిన ఇంటర్ విద్యార్థి హర్షత్‌సాయి (17) శుక్రవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. రంగయ్య, అమరావతి దంపతుల రెండో కుమారుడు హర్షత్‌సాయి విజయవాడలో శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే పరీక్షలు రాశాడు. కాగా రెండవ సంవత్సరం తరగతులకు రావాలని పిలవడంతో కొద్దిరోజులు ఆగి వెళతానని తల్లితో చెప్పాడు. దీంతో ఆమె మందలించి పంపించింది. రెండురోజుల క్రితం విజయవాడకు వెళ్లాడు. అక్కడ కాలేజీకి వెళ్లకుండా శుక్రవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చాడు. కుమారుడు వెనక్కు వచ్చాడని తల్లి ఏమి అనలేదు. ఉదయాన్నే టిఫిన్ పెట్టి ఆమె పనుల్లో నిమగ్నమయ్యారు. ఈక్రమంలో హర్షత్‌సాయి బెడ్‌రూములోకి వెళ్లి పడుకున్నాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో భోజనానికి రావాలని తల్లి పిలువగా పలకలేదు. దీంతో ఆమె కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతూ కుమారుడు కనిపించాడు. దీంతో బోరుమని విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రంగయ్య దక్షిణాఫ్రికాలో పరిశ్రమల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెద్ద కుమారుడు ఆదిత్య కన్యాకుమారిలో బీటెక్ చదువుతున్నాడని వారు తెలిపారు. ప్రస్తుతం ఇంటి వద్ద తల్లి అమరావతి మాత్రమే ఉంటోంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



హర్షత్‌సాయి మృతదేహం

గుంతకల్లు మీదుగా వేసవి రైలు



గుంతకల్లు, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణీకుల రద్దీని నియంత్రించడానికి బెంగళూరు-కలబురగి మధ్య ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నం.06519) ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీల్లో (శనివారాల్లో) బెంగళూరులో రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరునటిరోజు ఉదయం 7.40 గంటలకు కలబురగికి చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06520) ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో (ఆదివారాలలో) ఉదయం 9.35 గంటలకు కలబురగిలో బయలుదేరి అదేరోజు రాత్రి 8 గంటలకు బెంగళూరు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా గమ్యస్థానానికి చేరుతుందని వివరించారు.

రైళ్ల పాక్షిక రద్దు: నైరుతి రైల్వేజోన్ పరిధిలోని క్యాస్టిల్‌రాక్-కులెం రైల్వే సెక్షన్‌లో ట్రాక్ మెయింటెనెన్స్ పనులు చేస్తున్న కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే పలు రైళ్లను పాక్షికంగా రద్దుపరచినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. షాలిమార్-వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ (నం. 18047) రైలును ఈనెల 17, 19, 21, 22, 24, 26, 28 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 18048)ను ఈనెల 20, 22, 24, 25, 27, 29, మే 1 తేదీల్లోనూ హుబ్లీ-వాస్కోడిగామా సెక్షన్‌లో రైలును పాక్షికంగా రద్దుచేసి, కేవలం హుబ్లీ-షాలిమార్ సెక్షన్‌లో నడపనున్నట్లు తెలియజేశారు. అలాగే తిరుపతి/హైదరాబాద్-వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ (నం.17419/17021) రైళ్లను ఈనెల 17, 24 తేదీల్లోనూ, వీటి తిరుగు ప్రయాణపు రైళ్లను ఈనెల 18, 25 తేదీల్లోనూ వాస్కో-హుబ్లీ సెక్షన్‌లో రద్దుచేసి కేవలం హుబ్లీ-హైదరాబాద్/తిరుపతి సెక్షన్లలో నడపనున్నట్లు వివరించారు. సికింద్రాబాద్-వాస్కోడిగామా (నం.17039) రైలును ఈనెల 18, 23, 25 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17040)ను ఈనెల 19, 24, 26 తేదీల్లోనూ హుబ్లీ-సికింద్రాబాద్ సెక్షన్‌లో మాత్రమే నడపనున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగమనహళ్లి గ్రామ సమీప నేషనల్ హైవే వద్ద గుర్తు తెలియని వృద్ధుడి(75) శవాన్ని గుర్తించినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మతి స్థిమితం లేక గత కొన్ని రోజులుగా మండల చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ వృద్ధుడు సంచరించేవాడన్నారు. శుక్రవారం మధ్యాహ్నం లింగమనహళ్లి గ్రామ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద భోజనం చేస్తూ పడిపోయాడన్నారు. ఎండ వేడికి తాళేక మృతి చెంది ఉంటాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకుని స్థానిక వీఆర్వో సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

రాప్తాడు ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ కళాకారుల కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వైభవంగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాముడి విగ్రహం, మహా గణపతి, సుబ్రమణ్యస్వాముల విగ్రహాలను శుక్రవారం తెల్లవారుజామున ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆదినారాయణ, నరేష్, బసవరాజు, ఓబుళపతి, శేఖర్, ఆనంద్, మల్లికార్జున, అశోక్, ఆంజినేయులు, హనుమంతరాయుడు పాల్గొన్నారు.

రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్‌గా సుధాకర్ చౌదరి



రాప్తాడు ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన బి. సుధాకర్ చౌదరిని రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎంపిక చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 38 మార్కెట్ యార్డు చైర్మన్‌ల జాబితాను ప్రకటించారు. అందులో రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్‌గా సుధాకర్ చౌదరికు చోటు దక్కింది. తన ఎంపికకు సహకరించిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, నియోజకవర్గ టీడీపీ నాయకులకు సుధాకర్‌చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్ చౌదరికి కనగానపల్లి టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతులయ్య, నాయకులు అభినందనలు తెలిపారు.

తహసీల్దార్ విధులకు ఆటంకం.. ఇద్దరిపై కేసు

గార్లదిన్నె, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం ఓబుళాపురం కొట్టాల గ్రామంలో స్థలం విషయంలో ఇరు వర్గాలకు గత ఏడాది నుంచి వివాదం జరుగుతోందన్నారు. అదే స్థలం విషయంలో వారం రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో నాగులరెడ్డి అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. అదేవిధంగా ఓ యూట్యూబర్ నాగులరెడ్డితో కలసి తమ విధులకు ఆటంకం కలిగించిన్నట్లు తహసీల్దార్ బండారు ఈరమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

గార్లదిన్నె, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు శుక్రవారం గార్లదిన్నెలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి కిష్ట మాట్లాడుతూ... కూటమి నాయకులు ఎన్నికల ముందు అనేక వాగ్దాలు చేశారని గుర్తు చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖరశెట్టి, మంగమ్మ, మస్తాన్, ఖాదర్‌బాషా, వెంకటేశులు, ఓబులేసు, చితంబరప్ప పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌లో రాణిస్తేనే ఉద్యోగావకాశాలు

రాప్తాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్‌లో రాణిస్తేనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఎస్వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ తెలిపారు. మండలంలోని హంపాపురం సమీపాన గల ఎస్వీఐటీ కళాశాలలో శుక్రవారం హెచ్ అండ్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇంగ్లీష్ భాషపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏటవెంకటశివారెడ్డి, విభాగాధిపతి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

నార్పల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ బాలప్ప ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఖాజాబీ, లక్ష్మీరంగయ్య, బాబామైనుద్దీన్, శివారెడ్డి, వీరేష్, మురళి పాల్గొన్నారు.

మెగా బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన నిర్వహించనున్న మెగా బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని శ్రీరామ ఉత్సవ సమితి కన్వీనర్ శబరి పిలుపునిచ్చారు. శుక్రవారం వీహెచ్‌పి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 6వ తేదీ వందలాది బైక్‌లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నగర వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామ ఉత్సవ సమితి కన్వీనర్లు గల్లా హర్ష, లోకేపల్లి విశ్వనాథరెడ్డి, కోశాధికారి హితేన్ జైన్, సభ్యులు శ్రీనివాసులు, అజేష్ యాదవ్, నరేంద్ర, కిషోర్‌నాయుడు, మల్లికార్జున, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు నిధుల వితరణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 గ్రామాల్లో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణ కోసం నిధులు వితరణ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో 11 ఆలయాల నిర్వాహకులకు బ్యానర్, ప్రసాద వితరణ, పందిరి ఏర్పాట్లకోసం ఒకో ఆలయానికి రూ.3వేలు చొప్పున చెక్కులతోపాటు టీటీడీ కంకణాలు, భగవద్గీత పుస్తకాలను టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో రాజమునీంద్ర స్వామి, నాగేశ్వరరెడ్డి, నవత విజయ్, అర్చకులు పాల్గొన్నారు.



చెక్కులు, టీటీడీ కంకణాలు, భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

రోడ్లు గుంతలమయం.. ప్రయాణం భయానకం..!

● నిత్యం ప్రమాదాలు ● ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ పాలకులు ● కొత్త ప్రభుత్వంపై ఆశలు



గుంతలమయమైన మర్తాడు-కోటంక రోడ్డు, గుంతలు, అధ్వానంగా మారిన కొట్టాలపల్లి రోడ్డు

గార్లదిన్నె, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎక్కడ చూసినా గుంతలమయమైన రహదారులే దర్శనమిచ్చాయి. ఆ రహదారులపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఆ రహదారులకు ప్రస్తుత ప్రభుత్వంలో నైనా మోక్షం కలిగేనా...? అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండలంలోని గార్లదిన్నె నుంచి కోటంక గ్రామానికి వెళ్లే దారి సుమారు 12 కిలో మీటర్లు ఉంది. ఈ రోడ్డులో పూర్తిగా గుంతలు ఏర్పడడంతో ప్రయాణం సుమారు గంటకు పైగానే పడుతుంది. దీనికి తోడు దుమ్మూధూళి వస్తుండడంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. కమలాపురం క్రాస్ నుంచి కమలాపురం, కేకే తండా, కొట్టాలపల్లి, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల మీద ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో గార్లదిన్నె, అనంతపురానికి ప్రయాణం చేస్తుంటారు. గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

గార్లదిన్నె నుంచి మర్తాడు, కోటంక రోడ్డు గుంతలమయంగా ఉన్నది వాస్తవమే. గార్లదిన్నె నుంచి కోటంక వరకు సుమారు 10 కిలో మీటర్లు రోడ్డు ఉంది. రోడ్డు నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే రోడ్డు పనులు త్వరగా చేపడుతాం.

-శ్రీనివాసులు, జేఈ, పంచాయతీరాజ్‌శాఖ

ఈ రోడ్లు ప్రభుత్వాలకు కనిపించవు



గుంతలమయమైన రహదారులు అధికారులు, ప్రజా ప్రతినిధులకు కనిపించవు. నిత్యం గుంతల మయమైన రోడ్లపై నే ప్రయాణం చేస్తారే తప్ప పట్టించుకోరు. మర్తాడు, కోటంక, కొట్టాలపల్లి రోడ్డులో పూర్తిగా గుంతలు పడ్డాయి. గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వచ్చిపోయే భక్తుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వైసీపీ హయాంలో పూర్తిగా వదిలేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా రోడ్డు వేయాలి.

- చెన్నారెడ్డి, మండల కార్యదర్శి, సీపీఎం

పాలకులు నిర్లక్ష్యం వీడాలి



గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల పట్ల పాలకులు నిర్లక్ష్యం వీడాలి. మర్తాడు, కోటంక గ్రామాలకు పోయే ప్రధాన దారి దశాబ్దాల నుంచి గుంతలతో దర్శనమిస్తోంది. ఆ రోడ్డు పై ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోంది. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గత ప్రభుత్వంలో పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు, రోడ్డుపైనే వంటవార్పు కార్యక్రమాలు చేశాం. ప్రస్తుత పాలకులైనా స్పందించి రోడ్లు బాగుచేయాలి.

- అక్బర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయలసీమ రైతు సంఘం

నిత్యం ప్రమాదాలు



రోడ్లు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. మరమ్మతులు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. గ్రామాల నుంచి నిత్యం వేలాది మంది పనుల మీద ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. ప్రమాదకంగా ఉన్న రోడ్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలి. కమలాపురం క్రాస్ వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

- శ్రీనాథ్‌చౌదరి, సీపీఐ నాయకుడు

ప్రాంగణ నియామకాల్లో 80 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేకే డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 80 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాలల ప్రిన్సిపాళ్లు రామవేంద్రప్రసాద్, మునిక్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పీవీకేకే డిగ్రీ, పీజీ కళాశాలలో సథెరలాండ్, అల్లడిగి ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. 150 మంది విద్యార్థులు పాల్గొనగా 80 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాళ్లు తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, డైరెక్టర్ సింధూరరెడ్డి, కార్యదర్శి పల్లె రఘునాథరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ముఖ్యులు సురేష్‌బాబు, నరేంద్రారెడ్డి, బాబాఫక్రుద్దీన్, వన్నూరప్ప, కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● మేనేజ్‌మెంట్ మీట్‌లో ప్రతిభ

స్థానిక శ్రీ బాలాజీ పీజీ (ఎంబీఏ)విద్యార్థులు మేనేజ్‌మెంట్ మీట్‌లో ప్రతిభ చూపారు. ప్రిన్సిపాల్ సుబ్బారావు మాట్లాడుతూ.. ఈనెల 3న హిందుపురంలోని ఎన్‌లైట్ డిగ్రీ కళాశాలలో మేనేజ్‌మెంట్ మీట్ జరిగిందన్నారు. ఇందులో ఏడీ మార్కెటింగ్ విభాగంలో యశ్వంత్, సాత్విక, చంద్ర, బాను, బిజినెస్ క్విజ్‌లో నవీన్, సాయి వైష్ణవి, రేణుక, రమ్య ప్రతిభ కనబరిచారని తెలిపారు. అభినందన కార్యక్రమంలో వివిధ విభాగాల ముఖ్యులు సునీల్ కుమార్, రాఘవేంద్ర, ఉమేష్, శివకుమార్, ఆయాషా, మురళీధర్, ఎర్రిస్వామి, వేణుగోపాల్‌యాదవ్, హస్మత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యుత్ డి-4సెక్షన్ పరిధిలోని జీసెస్ నగర్ సబ్‌స్టేషన్ నందు 11కేవీ లైన్ బైఫర్‌కేషన్ నేపథ్యంలో శనివారం నగరంలోని పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అరవిందనగర్ ఫీడర్ పరిధిలోని అరవిందనగర్, నాయక్‌నగర్, ఆదర్శనగర్, సెవెన్‌హిల్స్ కాలనీ, విద్యుత్ నగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ నగర్, హౌసింగ్ బోర్డు, హమాలీ కాలనీ, లక్ష్మీనరసయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పింఛన్ల వెరిఫికేషన్ వద్ద వసతులు కల్పిస్తాం

శింగనమల ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రం శింగనమలలో పింఛన్లు వెరిఫికేషన్ సందర్భంగా దివ్యాంగులకు వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం 'పింఛన్ల వెరిఫికేషన్‌లో వసతులు శూన్యం' అనే కథనం ఆంధ్రజ్యోతి రావడంతో స్పందించిన ఎంపీడీఓ వసతులు కల్పించాలని మండల సమాఖ్య ఏపీఎం ఈశ్వరయ్యను ఆదేశించారు. ఆయనను ఎంపీడీఓ కార్యాలయానికి పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ఇక్కడ జరిగే దివ్యాంగుల పింఛన్లు వెరిఫికేషన్ కనీసం వసతులు కల్పించాలని ఆదేశించారు.

గర్భగుడి పునఃప్రతిష్ఠకు భూమిపూజ



గంగమ్మగుడి ప్రాంతంలో భూమిపూజ చేస్తున్న దృశ్యం

రామగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట దుర్గాంబ దేవస్థానం గంగమ్మపల్లి సమీపాన ఆంజనేయస్వామి గర్భగుడి పునఃప్రతిష్ఠకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామస్థులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. త్వరలో దుర్గాంబ ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో నిర్మాణం పూర్తీ చేసేలా చర్చించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తినాయుడు, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, సుధాకర్, దుర్గప్ప పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై ఆందోళన వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వన్నూరప్ప

అనంతపురం క్రైస్కట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ వన్నూరప్ప అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీసీ స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని బీసీ సంక్షేమవసతి గృహ వార్డెన్లకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ, సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ వన్నూరప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వన్నూరప్ప మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం కింద వివరాలు అర్జీదారుడుకు అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. దానికోసం ప్రత్యేక చట్టమే ఉందన్నారు. ఇదే సమయంలో పలువురు వార్డెన్లు కొందరు అర్జీదారులు సమాచారహక్కు చట్టాన్ని నీరుగారుస్తూ కొన్ని సంవత్సరాల వివరాలు అడుగుతున్నారని... వాటిని ఎలా ఇవ్వగలమని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ సూపరింటెండెంట్ నాగరత్నమ్మ, ఏబీసీడబ్ల్యూఓలు సుభాషిణి, రంగమ్మ, గంగాద్రి, బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్‌లతో పాటు పలువురు వార్డెన్లుపాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



సేవాలాల్ ఆలయ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న నాయకులు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట పంచాయతీ వైఎస్సార్ కాలనీ తండాలో సేవాలాల్ మహారాజ్, మాతా జగదాంబ ఆలయాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ, బీజేపీ రాప్తాడు కన్వీనర్ చైతన్య కిషోర్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు చక్రియ నాయక్, బాలాజీ నాయక్, విజయ కుమార్, సూర్య ప్రకాష్, శివ, రమణానాయక్, సురేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు

కనగానపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాల హాస్టల్‌లో ఇటీవల కలుషిత నీరు తాగి విద్యార్థులు అనారోగ్యానికి గురవడంతో ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందించి ఆర్ఓ ప్లాంటును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చొరవతో పాఠశాలకు ఆర్ఓ ప్లాంటు మంజూరు కావడంతో శుక్రవారం ప్లాంటును ఎంఈఓ శ్రీదేవి, ప్రిన్సిపాల్ రవికిరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకే పరిమల రామక్రిష్ణ, నాయకులు సురేష్ చౌదరి, నరేంద్ర పాల్గొన్నారు.



ఆర్ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

పాత పద్ధతిలోనే ప్రవేశాలు కల్పించాలి: ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో కాకుండా పాత పద్ధతిలోనే నిర్వహించాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్‌జీ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమయిందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3,580 కోట్లు పెండింగ్ ఉండగా రూ.788 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పీజీ సెట్ రద్దు చేసి...గతంలో మాదిరిగా యూనివర్సిటీ సెట్ నిర్వహించాలన్నారు. డిగ్రీ సైతం ఆన్‌లైన్ అడ్మిషన్లకు స్వస్తి పలకాలన్నారు. కేజీబీవీలు, గురుకులాలు, గిరిజన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెం టనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సం ఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వా మి, ఇతర నాయకులు అంజనేయులు, నరసింహ, రాధాజ్యోతి, వెంకటనా యక్, వంశీ, మంజునాథ్, చందు, ర మణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాసర్‌జీ

చెత్తతో సంపద కేంద్రం పరిశీలన

నార్పల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బొందలవాడలోని చెత్త సంపద కేంద్రాన్ని సర్పంచు ఆలం వెంకటనరసానాయుడు మహిళలతో ర్యాలీగా వెళ్లి శుక్రవారం పరిశీలించారు. ఇళ్లలోని చెత్తను పారిశుధ్య కార్మికులకు ఇస్తే.. అది ఏ విధంగా సేంద్రియ ఎరువుగా మారుతుందో వివరించారు. వ్యక్తులు బాగుంటే కుటుంబాలు బాగుంటాయి, కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే గ్రామం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజరాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీఎం తిప్పమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'శవ రాజకీయాలు మానుకోండి'



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ, ఎస్టీ నాయకులు

రామగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శవరాజకీయాలు చేయడం మానుకోవాలని, గ్రామాల్లో కులాల మధ్య చిచ్చుపెట్టవద్దని టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని హెచ్చరించారు. శుక్రవారం రామగిరిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు నాయక్, ఎస్సీ సెల్ నాయకులు సుబ్బరాయుడు, పోతన్న, ఆవుల ముత్యాలు, మారెన్న, ఎస్టీసెల్ నాయకులు రాజునాయక్, గోపాల్‌నాయక్, నారాయణ, కాంతి తదితరులు మాట్లాడారు. బి.యాలేరులో మీరు చేసిన దౌర్జన్యాలు మరచిపోయారా.. మీరు ఎస్టీ, ఎస్సీలకు ఏమాత్రం గౌరవం ఇస్తారో ప్రజలందరికి తెలుసు అన్నారు. ఇంటి పేరు ముందు కులాన్ని చేర్చి కుల రాజకీయాలు చేస్తున్నారని, పాపిరెడ్డిపల్లిలో మజ్జిగ లింగమయ్య మృతికి తాము ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. పరిటాల కుటుంబానికి ఎంతోమంది కురుబలను ప్రజాప్రతినిధులను చేసిన చరిత్ర ఉందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మజ్జిగ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించే పేరుతో రాజకీయం చేయడం కోసమే వస్తున్నారని అన్నారు.

కదిరి ఎంపీపీపై కేసు నమోదు

కదిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ తోట అమరనాథ్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. అనంతపురం నగరంలోని ఎన్ఆర్ఐ కళాశాలకు చెందిన వెన్నపూస విశ్వనాథ రెడ్డి ఏడాదిన్నర క్రితం అమరనాథ్‌రెడ్డి వద్ద వ్యక్తిగత అవసరాల కోసం కొంత మొత్తం అప్పు తీసుకున్నాడని, తిరిగి చెల్లించినా వడ్డీకోసం వేధిస్తున్నాడని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వడ్డీ సొమ్ముకోసం చెక్కులు కూడా ఇచ్చానని, అయినా తన ఇంటి వద్దకు వచ్చి కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

జుడియో షాపింగ్ మాల్‌కు నోటీసులు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట సర్కిల్‌లోని జుడియో షాపింగ్ మాల్ నిర్వాహకులకు పంచాయతీ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షానికి షాపింగ్ మాల్ వెనుకభాగంలో గోడ కూలిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఘటనపై పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారి ప్రవీణ్‌బాబు నోటీసులు జారీ చేశారు. అహుడా అనుమతులకు విరుద్ధంగా ఆదనపు అంతస్తుల నిర్మాణం చేసినట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. అనుమతించిన ప్లానుల ప్రకారం సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మాణం చేసినట్లు తెలిపారు. రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ర్యాంపులు, మెటికలు నిర్మించినట్లు పేర్కొన్నారు. నివాసభవనానికి అనుమతులు పొంది, అందుకు భిన్నంగా వ్యాపార భవననిర్మాణం చేసినట్లు నోటీసుల్లో వెలువరిచారు. ప్రమాద నివారణ చర్యలు చేపట్టుటలో నిర్మాణ లోపాలున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. ఆ మేరకు వారంరోజుల్లో షాపింగ్ మాల్ పనిని నిలుపుదల చేయాలని సూచించారు.

7న మండల సర్వ సభ్యసమావేశం

రాప్తాడు ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 7న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని తెలిపారు.

లింగనిర్ధారణపై చర్యలు తీసుకోండి: ఆర్డీఓ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణతో అబార్షన్ చేసి భ్రూణహత్యలకు పాల్పడే డాక్టర్లు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశించారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో లింగనిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గర్భంలో ఉన్నది ఆడ,మగ అని పరీక్షించడం చట్ట విరుద్ధం అన్నారు. డబ్బులకు ఆశపడి కొన్ని స్కానింగ్ సెంటర్లు, కొందరు డాక్టర్లు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై నిరంతరం నిఘా ఉంచి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్లు రవికుమార్, శ్రావణి, దుర్గేష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్,రెడ్స్ భానూజా, హెడ్స్ రామ్మోహన్, ఐఅండ్‌పీఆర్ గురుస్వామిశెట్టి, డెమోలు త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

శింగనమల ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులు, వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం శింగనమలలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం భారీ వర్షం, ఈదురుగాలులకు శింగనమల మండలంతోపాటు జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, కూరగాయలు, పండ్లతోటలకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. పంట నష్ట వివరాలను సమగ్రంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మధుయాదవ్, మధు, వెంకటరెడ్డి, ఓబులపతి, నాగప్ప పాల్గొన్నారు.

పట్టభద్రులుగా చిన్నారులు



పట్టాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం రోడ్డులోని నారాయణ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. నల్లకోటు ధరించి తలపై టోపీ, చేతిలో పట్టాలు పట్టుకున్న విద్యార్థుల వేషధారణ అకట్టుకుంది. చిన్నారుల నృత్యం, నాటకాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ, వైస్ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు గుణశ్రీ, చంద్రకళ, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిన బీజేపీ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుతో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కేసిందని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం నగరంలోని మసీదుల వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగయ్య, రామాంజనేయులు, వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, శీన, రాజు, వెంకటేశు, బాలకృష్ణ, పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు చైర్మన్‌గా హనుమంతరెడ్డి



రాయదుర్గం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఉండ్రాల హనుమంతరెడ్డిని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. డీ.హీరేహాళ్ మండలం గొడిశలపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి టీడీపీ మండల కన్వీనర్‌గా సేవలందిస్తున్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు అత్యంత సన్నిహితులు. టీడీపీ సీనియర్ నాయకుడిగా ఉంటూ అన్ని వర్గాలతో కలిసి మెలసి ఉంటున్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమించడం పట్ల ఆయన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. రాయదుర్గం మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు.

వైస్ చైర్మన్‌గా కోనంకి రాజశేఖర్..



కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా కోనంకి రాజశేఖర్‌ను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయనతో పాటు మరో 14 మందిని కమిటీ మెంబర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీం తో పూర్తిస్థాయిలో మార్కెట్ యార్డు కమిటీ ఏర్పాటైంది. మార్కెట్ యార్డు అభివృద్ధికి చైర్‌పర్సనతో, సభ్యులతో కలిసి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కోనంకి రాజశేఖర్ తెలిపారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సజావుగా సర్వసభ్య సమావేశం

గుత్తి రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ విశాలక్షి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఇందులో పలువురు సర్పంచులు మాట్లాడుతూ గుత్తి మండలాన్ని కరువు కింద ప్రకటించాలని కోరారు. అలాగే రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందజేయాలని, కౌలు రైతులకు రుణాలందజేయాలని, గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, సర్పంచులు భరత్, రమేష్ నాయుడు, వెంకటేష్, గోపాల్, వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలే శ్రేయస్కరం

గుత్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలే శ్రేయస్కరమని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ఎల్లప్ప పేర్కొన్నారు. ఆసుపత్రిలో గర్భిణులకు శుక్రవారం ఆయన సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాలతోనే తల్లీబిడ్డకు క్షేమం అని తెలిపారు. తప్పనిపరిస్థితి అయితే తప్ప సిజేరియన్ ఆపరేషన్‌కు వెళ్లరాదన్నారు. గర్భిణులు పౌష్టకాహారం విధిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రమ్యశ్రీ, హెడ్‌నర్స్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నిషేధిత చట్టంపై సమీక్ష

గుంతకల్లుటౌన్/ కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాస్ అధ్యర్యంలో లింగనిర్ధారణ నిషేధిత చట్టంపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. లింగ వివక్షతపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, ప్రైవేట్ స్కాన్ సెంటర్లపై నిఘా ఉంచాలని, గర్భ నిరోధక మాత్రలు మందుల షాపులలో యథేచ్ఛగా విక్రయిస్తున్నారని, వీటిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ యుగంధర్, వైద్యులు సుజాత, పవన్‌కుమార్, రామాంజనేయులు, కళ్యాణ్, అరుణ, హరిత, ఏఓ భూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గంలోని ఆర్డీవో కార్యాలయంలోనూ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డివిజనల్ స్థాయి కమిటీ సమావేశం జరిగింది. రెవెన్యూ డివిజనల్ పరిపాలన అధికారి ఈశ్వరమ్మ, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ప్రసన్న భారతి, ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, డీఈవో తిప్పేస్వామి, వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఉరవకొండ,ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని వజ్రకరూరు టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు డిమాండ్ చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఉపాధిసిబ్బంది దోపిడీ చేశారని తెలిపారు. అక్రమార్కుల నుంచి సొమ్మును రికవరీ చేయాలని కోరారు. నాయకులు సుధాకర్, మోహన్‌రావు, హరిప్రసాద్, నాగన్న, ఎర్రిస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

ఏఓపై మూడోసారి విచారణకు ఆదేశం

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వివాదాస్పదంగా మారిన ఏఓ రాంప్రసాద్‌పై మూడో సారి సెకెండరీ హెల్త్‌డాక్టరేట్ ఆఫ్ కమిషనర్ డాక్టర్ సిరి శనివారం విచారణకు ఆదేశించారు. ఇతడిపై చర్యలు తీసుకోవాలని విజయవాడలో ఇటీవల సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. దీనిపై స్పందించిన కమిషనర్ జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ ఏపీ సెక్రెటరీ హెల్త్ గుంటూరు జిల్లాకు చెందిన డాక్టర్ మజీదాబీను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు శనివారం ఉదయం విచారణ నిమిత్తం అధికారి గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి రానున్నారు.

గేట్స్‌లో ఘనంగా వార్షికోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి

గుత్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఉన్న గేట్స్ కళాశాలలో శుక్రవారం కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్‌రెడ్డి జ్యోతిప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రస్తుతం వస్తున్న మార్పులను గుర్తించి కొత్త ఆవిష్కరణలు చేసి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఆధారపడి ఉందని, కావున ప్రతిఒక్కరూ దీనిపై పట్టుసాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. కళాశాల డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, కోఆర్డినేటర్ ప్రవీణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ పాఠశాల వార్షికోత్సవం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం సాయంత్రం ఇండియన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 10వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎస్ రామ్మోహన్ గుప్తా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరెస్పాండెంట్ పవన్‌కుమార్ గౌడ్, హెచ్‌ఎం యశోద, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

యథేచ్ఛగా రేషన్‌బియ్యం అక్రమ రవాణా

- ప్రతిరోజూ భారీగా కర్ణాటకకు తరలింపు
- అధికారులు, పోలీసుల దాడులను లెక్కచేయని అక్రమార్కులు



ఇటీవల కుందుర్పిలో పట్టుబడిన రేషన్‌బియ్యంతో పోలీసులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : కళ్యాణదుర్గం నియోజకవర్గం మీదుగా ప్రతిరోజూ వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు. రేషన్ బియ్యానికి కర్ణాటక రాష్ట్రంలో మంచి ధర లభిస్తుండటంతో సరిహద్దు ప్రాంతాలైన కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు రేషన్‌బియ్యాన్ని కిలో రూ. 10ల చొప్పున సేకరించి నిల్వలు ఏర్పాటు చేసి రాత్రికి రాత్రే సరిహద్దులు దాటిస్తున్నారు. కర్ణాటకలో కిలో రూ. 20 నుంచి రూ. 25 ల వరకు విక్రయిస్తున్నారు. అంతేకాకుండా వా టిని అక్కడే పాలిష్ చేయించి కిలో రూ.30 నుంచి రూ.40 వరకు కూడా అమ్ముతున్నారు. దీంతో రేషన్ బియ్యం అక్రమ రవాణా లాభసాటిగా ఉండటంతో విచ్చలవిడిగా సాగుతోంది. అప్పుడప్పుడు విజిలెన్స్, పోలీసుల దాడుల్లో పట్టుబడుతున్నా బియ్యం రవాణా మాత్రం ఆగడం లేదు.

అక్రమ రవాణా సాగుతోందిలా..

ఉరవకొండ నుంచి కళ్యాణదుర్గం మీదుగా కంబదూరును దాటుకుని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి యథేచ్ఛగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెల్లవారుజామున సమయాల్లో బొలెరో వాహనాల్లోనూ, ఆటోల్లోనూ రవాణా సాగుతున్నట్లు సమాచారం. దారిలోనే కళ్యాణదుర్గం, కంబదూరు పోలీస్‌స్టేషన్లు ఉన్నప్పటికీ అక్రమార్కులు వారి కళ్లుగప్పి వెళ్లుతున్నారు. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నా వారిలో ఏ మాత్రం భయం పుట్టడం లేదు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి కేవలం మూడు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయి. దీంతో ఎక్కువగా అక్రమ రవాణా సాగుతోంది. ఎక్కువగా కళ్యాణదుర్గం మండలం మోరేపల్లి, కొత్తూరు అటవీప్రాంతంలోని దారి గుండా కుందుర్పి మండలం బెస్తరపల్లికి వెళ్లి అక్కడి నుంచి కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. ఈ తతంగం గత కొన్నేళ్ల నుంచి సాగుతున్నా అధికారులు అరికట్టలేకపోతున్నారు.

గతంలో పలుమార్లు..

ఇటీవల కుందుర్పి మండలంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోతుండటంతో ఆటోలతో సహా పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా కంబదూరులో కూడా ఆటోల్లో తరలుతున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కళ్యాణదుర్గం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఇంకా చాలా జరిగాయి. కానీ మార్పు మాత్రం రావడం లేదు. ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. కొందరు అధికారులు పట్టుకున్నవాటిని మామూళ్లు తీసుకుని వదిలేసిన సంఘటనలు కూడా జరిగినట్లు తెలుస్తోంది.

సమాచారం అందిస్తే దాడులు చేస్తాం..



రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు పోలీసులకు సమాచారం తెలియచేస్తే దాడులు చేసి చర్యలు తీసుకుంటాం. నిత్యం సిబ్బందితో పూర్తిగా గస్తీ నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా సరిహద్దు మండలాల్లో పూర్తి స్థాయిలో నిఘా పెట్టాం. పోలీసులకు ఆయా గ్రామస్థులు సహకరిస్తే పూర్తిస్థాయిలో వీటికి అడ్డుకట్ట వేసే అవకాశాలు ఉన్నాయి.

- రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఆటో బోల్తా.. 11 మంది కూలీలకు గాయాలు



బోల్తా పడిన ఆటో



అంబులెన్స్‌లో గాయపడిన కూలీలు

విడపనకల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాల పల్లి గ్రామం వద్ద ఆటో బోల్తా పడి 11 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్లితే.. పెద్ద కొట్టాల పల్లి గ్రామానికి చెందిన కూలీలు మిరపకాయలు కోసేందుకు కరకముక్కల గ్రామానికి శుక్రవారం ఉదయం ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం అదే గ్రామంలో స్వగ్రానికి బయలుదేరారు. గ్రామంలోని బస్టాండ్ వద్దకు రాగానే బైక్ షడన్‌గా అడ్డం వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో ఆటో రోడ్డు పక్కనే ఉన్న చెట్టును డీ కొని బో ల్తా పడింది. ప్రమాదంలో అందులోని 11 మం ది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరి లో 9 మంది మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. క్షతగాత్రులను వెంటనే స్థానికులు 108 వాహనంలో ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి 8 మంది మహిళా కూలీలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కామాక్షమ్మ, ఆదిలక్ష్మి, శాంతి, గీతమ్మ, రామలక్ష్మి, అశ్వర్థమ్మ, ప్రతిభ, నగేంద్ర, వన్నూరప్ప, జానకి, పార్వతమ్మ ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీంద్ర, మాజీ సర్పంచ్ రంగనాయకులు, లోకేశ్ తదితరులు వెంటనే ఉరవకొండ ఆసుపత్రి వద్దకు చేరకుని బాధితులను పరామర్శించారు.

బాల్య వివాహాలను అరికడదాం

పెద్దవడుగూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని సచివాలయం-1లో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై కమిటీ సమావేశం సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యంలోనే వివాహాలు చేయడం వల్ల బాలికలకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అలాగే మానసిక రుగ్మతలకు లోనవుతారన్నారు. చివరికి వారి జీవితం అంధకారమవుతుందని తెలిపారు. కనుక బాల్యవివాహాలను నిర్మూలించి బాలికలను బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆడపిల్ల చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మహిళా పోలీసులు శాంత, ప్రత్యూష, వీఆర్‌ఏ అనిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పందుల అపహరణ కేసులో నిందితుడి అరెస్టు

బెళుగుప్ప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ ఏడాది జనవరి 6వ తేదీ రాత్రి పందులను అపహరించిన కేసులో నిందితుడు సాకే ఆదినారాయణను కళ్యాణదుర్గం మండలం మానిరేవు వద్ద శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. అలాగే ఇతని నుంచి రూ. 40 వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ఐదుగురు వుండగా గత నెల 28వ తేదీ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఒకరు కర్ణాటక జైలులో ఉన్నాడని, మరో నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

విడపనకల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు-గాజుల మల్లాపురం గ్రామాల మధ్యలో బీటీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ మండల టీడీపీ నాయకులు శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ సుమారు రూ. 95 లక్షల వ్యయంతో ఈ రోడ్డును నిర్మించనున్నట్లు చెప్పారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ



పూజలు చేస్తున్న కేరళ వేద పండితులు

బెళుగుప్ప, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తి కావడంతో శుక్రవారం ప్రత్యేక మండల పూ జలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు కేరళకు చెందిన వేదపండితులను పిలిపించి కలశపూజ, హోమం, రుద్రాభిషేకం, తదితర పూజలు చేయించారు. తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. యాడికి మండలం రాయలచెరువుకు చెందిన రవి, ధనుంజయ గుత్తికి బైక్‌లో వస్తున్నారు. అయితే పట్టణంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను ప్రమాదవశాత్తూ ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ గాయపడగా స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంధత్వ నివారణ వారోత్సవాలు

తాడిపత్రి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లి, ఇగుడూరు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం అంధత్వ నివారణ వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తాడిపత్రి డివిజన్ ప్రభుత్వ కంటివైద్యుడు మధుసూదన్‌రాజు విద్యార్థులకు గ్లకోమా, శుక్లాలు, దృష్టిలోపాల నుంచి కళ్లను సంరక్షించుకోవడం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాల గురించి వివరించారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తోందని తెలిపారు. హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

- పంటలను కాపాడుకునేందుకు అగచాట్లు



గోవిందవాడలో మిర్చిపై కప్పిన టార్పాలిన్లు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పంట చేతికి అందే తరుణంలో అకాలవర్షం అన్నదాతలను కలవరానికి గురి చేస్తోంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలు పాడవకుండా కాపాడుకునేందుకు రైతులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ముఖ్యంగా మిర్చి పంట ఆరుబయటే ఎండబెడుతున్నారు. మండలంలోని గోవిందవాడ, తార్కాపురం తదితర గ్రామాల్లో మిరపను తొలగించి కల్లాల్లో ఆరబెట్టగా మరి కొంత పంట పొలాల్లోనే ఉంది. కాగా బుధ, గురువారాల్లో రాత్రి వర్షం పడిన నేపథ్యంలో పొలాల్లోని మిర్చిపంట తడిసి రైతుకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రైతులు కల్లాల్లో ఉన్న పంట తడవకుండా టార్పాలిన్లు కప్పి కాపాడుకుంటున్నారు. మిరపకాయలు తడిస్తే తాలుగా మారే పరిస్థితి ఉందని, దీంతో వాటిని తడవకుండా కాపాడుకోవడానికి నానా అగచాట్లు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

దర్జాగా ప్రభుత్వ లేఅవుట్ కబ్జా

- గత ప్రభుత్వంలో ఇంటిస్థలాల పంపిణీ కోసం ప్లాట్ల ఏర్పాటు
- నంబర్ రాళ్లను తొలగించి చదును చేసిన వైనం



ఆక్రమణ కోసం ప్రభుత్వ లే అవుట్‌ను చదును చేసిన దృశ్యం

యాడికి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన గ్రామంలో ప్రభుత్వం ఇంటిస్థలాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన ప్లాట్లను యథేచ్ఛగా కబ్జా చేసేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటిస్థలాల పంపిణీ కోసం అధికారులు గ్రామంలో లేఔట్ ఏర్పాటు చేశారు. అందులో ప్లాట్లు వేసి నెంబర్ రాళ్లను సైతం పూడ్చారు. కొద్దిమందికి ఇంటిస్థలాలు కేటాయించి పట్టాలు కూడా పంపిణీ చేశారు. మిగిలిన ప్లాట్లు ఖాళీగా ఉండడంతో వాటిపై ఓ వైసీపీ వర్గీయుడు కన్నేశాడు. ఈ క్రమంలో నాలుగురోజుల క్రితం ప్లాట్ల నెంబర్ రాళ్లను సైతం పెకలించి కబ్జా చేయడానికి ఆ ప్రాంతమంతా చదును చేయించాడు. ప్లాట్ల నెంబర్ రాళ్లను తొలగించి ఏకంగా గట్టులోకి దొబ్బేశాడు. ఇక ఆ ప్రాంతం అంతా కబ్జా అయినట్లే అని స్థానికులు చర్చించుకుంటున్నారు. పేదలకు ఇంటిస్థలాల పంపిణీ కోసం ప్రజాధనంతో ఏర్పాటుచేసిన లేఔట్‌ను ధ్వంసం చేసి కబ్జా చే యడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కబ్జా అయిన లేఔట్‌లోని ప్లాట్లను అధికారులు తిరిగి స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అంటున్నారు. దీనిపై తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా లేఔట్ కబ్జా విషయం తమ దృష్టికి రాలేదన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తొలగించిన నంబర్ రాయి

భూములిచ్చే రైతులకు న్యాయం చేయండి

- ఆర్డీఓకు విన్నవించిన కమలపాడు, చింతలాయపల్లి గ్రామాల ప్రజలు



కుందనకోటలో మాట్లాడుతున్న ఆర్డీఓ

యాడికి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కమలపాడు పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం భూములు ఇస్తున్న రైతులకు న్యాయం చేయాలని కుందనకోట, చింతలాయపల్లి గ్రామాల ప్రజలు గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్‌ను కోరారు. ఆ గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న కమలపాడు పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్ట్‌పై శుక్రవారం అధికారులు ఆ రెండు గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీఓ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కమలపాడు పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 874.70 ఎకరాల్లో ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందులో ప్రభుత్వ భూమి 276.98 ఎకరాలు, పట్టా భూములు 597.72 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ ఏర్పాటు వలన కలిగే ఉపయోగాలను వివరించారు. దీనిపై అభిప్రాయాలను తెలపాలని గ్రామస్థులను కోరారు. ప్రాజెక్ట్ ఏర్పాటు తమకు సమ్మతమేనని, అయితే రైతుల నుంచి సేకరించే భూములకు గిట్టుబాటు ధర కల్పించాలని గ్రామస్థులు తెలిపారు. సేకరించే భూములకు ధరలు నిర్ణయించకుండా ఇంకా ఎన్ని సమావేశాలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. భూములు కోల్పోనున్న కుటుంబాల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని, గిట్టుబాటు ధర కల్పించేలా చేస్తామని ఆర్డీఓ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఏఓ మహబూబ్‌బాషా, గుంతకల్లు డివిజనల్ సర్వేయర్ నాగరాజు, వీఆర్వోలు, ఏపీ జెన్‌కో అధికారులు, పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన

పెద్దవడుగూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతులు సాగుచేసిన పలు పండ్లతోటలను రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, సీపీఐ సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటలకు లాభసాటి ధర లేదన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పండ్లతోటల రైతులను ఆదుకోవాలని కోరారు. ఈనెల 8న జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ హాల్లో రాష్ట్రస్థాయి హార్టికల్చర్ సదస్సు జరుగనుందని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తర్వాత అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సీపీఐ, రైతు సంఘం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో అపచారం జరగలేదు: వీహెచ్‌పీ

రాయదుర్గం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో విగ్రహాలను కదిలించి ఎలాంటి అపచారం చేయలేదని విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు దేవరెడ్డిపల్లి రాజేష్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఆలయంలో విగ్రహాలు కింద పట్టు సరిగా లేనందున కదులుతున్నాయని, దీంతో దిగ్బంధనం చేసి సరి చేయడం జరిగిందని తెలిపారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది స్వార్థపరులు దేవాలయ ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రచారాలు చేయడం తగదన్నారు. రాజకీయ పబ్బం గడపడానికి కొందరు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

యాడికి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను తూనికలు, కొలతలశాఖ అధికారి వైజీ శంకర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో ఓ దుకాణంలో బియ్యం తూకంలో భారీ తేడా ఉన్నట్లు గుర్తించారు. డబ్బాతో బియ్యం తూకం వేసినప్పుడు సుమారు 1530 గ్రాముల తేడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో డబ్బాతో బియ్యం వేసినప్పుడల్లా లబ్ధిదారుల నుంచి 1530 గ్రాముల బియ్యాన్ని దోపిడీ చేస్తున్నారని డీలర్‌పై మండిపడ్డారు. రేషన్‌షాపుల్లో డబ్బాలను పెట్టి కేజీ నుంచి 2కేజీల వరకు తక్కువ తూకం బియ్యం ఇస్తున్నారని, ఇలా ప్రజలను మోసగించడం తగదని ఆగ్రహంవ్యక్తం చేశారు. అనంతరం తక్కువ తూకం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 500గ్రాముల చక్కెర ప్యాకెట్ ధర రూ.17 ఉండగా రూ.20లకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లు వీటిని ఇంతటితో ఆపేయాలన్నారు. పునరావృతం చేస్తే లీగల్ మెట్రోలజీ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెర్లోపల్లిలో కేబుల్ చోరీ

పుట్లూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ముగ్గురు రైతుల పొలాల్లో విద్యుత్ కేబుల్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, రామానాయుడుతో పాటు మరో రైతుకు చెందిన పొలాల్లోని బోరు మోటార్ల వద్ద కేబుల్‌ను శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు కట్‌చేసి ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. ఒక్కో బోరు మోటారు వద్ద సుమారు 10మీటర్ల మేర కేబుల్ ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ఇప్పటికే మడ్డిపల్లి, కడవకల్లు, చెర్లోపల్లిలలో వరుసగా కేబుల్ చోరీలు జరిగాయి. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. తాడిపత్రి-తిమ్మంపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న తోటలను టార్గెట్ చేస్తూ దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘాపెట్టి చోరీలను నివారించాలని రైతులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బొమ్మనహాళ్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకెండ్ ఇయర్ విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపాల్ మోహన్ కుమార్ పాత్ర, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సుమారు 230 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఈ పుస్తకాలను సరఫరా చేసిందని తెలిపారు. మొదటి రోజు 100 మందికి పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. అధ్యాపకులు హనుమంతునాయక్, శంకర్‌లింగ, స్వప్న, వరలక్ష్మి, భూపతి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవండి: ఏఎస్పీ

తాడిపత్రి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను విడిచి సన్మార్గంలో నడవాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి మట్కాబీటర్లు, రౌడీషీటర్లను హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన స్థానిక మట్కాబీటర్లను, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును ఎంచుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. మీరు చేసే చెడు పనుల ప్రభావం మీ పిల్లల మీద పడుతుందని తెలిపారు. కష్టపడి పనిచేసుకుంటూ కుటుంబీకులతో సంతోషంగా గడపాలని సూచించారు. మార్పు రాకపోతే పట్టణ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ముస్లింలు

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముస్లిం మైనార్టీలు శుక్రవారం వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ వద్ద నూరానీ మసీదు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వానికి, వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ముస్లింమైనార్టీల నాయకులు మాట్లాడుతూ.. దేశంలో 29కోట్ల పైగా జనాభా ఉన్న ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నారన్నారు. మైనార్టీల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్రప్రభుత్వం వక్ఫ్ బిల్లు అమలు చేయడం దారుణమన్నారు. వెంటనే ఆ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీల నాయకులు మౌల, ఎంఎం రహిమాన్, ఎండీఆర్ ఖలీల్, దాదా, అబ్దుల్‌బాసిద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు మసీదుల వద్ద వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కరపత్రాలను పంపిణీ చేశారు.